ఈనాడు ప్రకాశం
గురువారం 24 అక్టోబరు 2024 5

దేవుడి పేరిట మద్యానికి వేలం పాట



మద్యం గొలుసు దుకాణం నిర్వహించేందుకు దేవుడి పేరిట కొందరు వేలం పాట నిర్వహించారు. అర్ధవీడు మండలం మాగుటూరులో చోటుచేసుకున్న ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగు చూసింది. ఆ గ్రామానికి చెందిన కొందరు మద్యం గొలుసు దుకాణం ఏర్పాటుకు ముందుకొచ్చారు. పోటీ లేకుండా నిర్వహించుకునేందుకు వేలం నిర్వహించారు. సుమారు రూ.7.10 లక్షలకు ఇద్దరూ వ్యక్తులు పాడుకున్నారు. ఇందుకుగాను మద్యం సీసాపై ధర కంటే అదనంగా రూ.50 వరకు వసూలు చేసుకునేలా ఒప్పందం చేసుకున్నారు. వేలంపాటలో పాడిన నగదును వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఇచ్చేలా నిర్ణయించారు. ఆలయ ఆవరణలో కూర్చుని మద్యం గొలుసు దుకాణానికి వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో దర్శనమిచ్చాయి. ఈ సమాచారం పోలీసులకు చేరడంతో ఎస్సై సుదర్శన్ వివరాలు సేకరించే పనిలో పడ్డారు. వేలంలో పాల్గొన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయనున్నట్లు ఎస్సై తెలిపారు. – న్యూస్‌టుడే, అర్ధవీడు



బాధ్యత మరిచి.. గుండ్లకమ్మకీ గతి

బాధ్యత లేని నాటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మద్దిపాడు మండలం మల్లవరంలోని గుండ్లకమ్మ ప్రాజెక్ట్‌కు దుర్గతి పట్టించారు. నిర్వహణ మరవడంతో జలాశయానికి చెందిన రెండు గేట్లు కొట్టుకుపోయాయి. నెల రోజుల్లో ఏర్పాటు చేస్తామంటూ పలికిన నాటి పాలకుల మాటలు నీటి మీద రాతలే అయ్యాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక కొట్టుకుపోయిన గేట్లతో పాటు మిగిలిన వాటినీ పునరుద్ధరించే పనులు చేపడుతోంది. ఈ సమయంలోనే ఎగువ నుంచి రోజుకు 7,900 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. పనుల అసంపూర్తితో ఒకటిన్నర టీఎంసీలకు మించి నిల్వ చేసేందుకు అవకాశం లేకపోయింది. విధి లేక దిగువకు జలాలు వదిలేయాల్సి వస్తోంది. – ఈనాడు, ఒంగోలు

ఇంతింతై.. దారులన్నీ గుంతలై!



- రోడ్లను పట్టించుకోని నాటి సర్కారు
- నిర్వహణకు చిల్లిగవ్వ ఇచ్చిందీ లేదు
- కూటమి ప్రభుత్వం దృష్టిసారిస్తేనే మేలు

అయిదేళ్ల జగన్ పాలనలో ఎందరో అభాగ్యులను గుంతల రోడ్లు బలి తీసుకున్నాయి. గత వైకాపా సర్కారు నిర్లక్ష్యం మరెందరో ఆడపడుచుల పసుపు కుంకుమలను తుడిచేసింది. పలువురి జీవితాలను మోడువారేలా చేసింది. బతుకుల్లో వెలుగును ఆర్పేసింది. వాటిపై ప్రయాణాల మూలంగా వాహనాలకు మరమ్మతులూ అధికమై ఖర్చులు భరించలేనంతా మారాయి. ఈ బాధలన్నీ పడలేమని జనం మొత్తుకున్నా కొత్త రోడ్లు వేయించలేదు. పాత వాటిని బాగు చేయించలేదు. కనీసం గుంతలూ పూడ్పించలేదు. నాటి నిర్లక్ష్యం. . ఇటీవల వరుసగా కురిసిన వర్షాలతో ప్రస్తుతం రహదారులు మరింతగా దెబ్బతిన్నాయి.

తక్షణమే 245 కిలో మీటర్ల మేర రహదారులకు మరమ్మతులు చేయాలని రోడ్డు భవనాల శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆ మేరకు నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. తక్షణమే చేపట్టి పూర్తిచేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాల్సి ఉంది.

- తాళ్లూరు మండలంలోని విఠలాపురం- లింగాలపాడు మార్గంలో మన్నేపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రహదారి వర్షం వచ్చిన ప్రతిసారీ నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. ఇటుగా రాకపోకలకు తాళ్లూరు, ముండ్లమూరు వాసులు అవస్థలు పడుతున్నారు.
- కొత్తపట్నం నుంచి గుండమాల మార్గంలో మోటుమాల వద్ద ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. వర్షాలకు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. ఇటుగా ఉప్పు లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. బీరంగుంట, ఆలూరు, గద్దెపాలెం, గుండమాల వాసులకూ ఇదే ఆధారం.
- మార్కాపురం- తర్లుపాడు ప్రధాన రహదారి అంచులు కోతకు గురయ్యాయి. వీటిపై అడుగుకో గుంత దర్శనమిస్తోంది. రాత్రి వేళల్లో ఇటుగా ప్రయాణమంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే.
- కనిగిరి- వేములపాడు రహదారిలో దాదాపు అయిదు కిలో మీటర్ల మేర అధ్వానంగా మారింది. మరమ్మతులకు నిధులు మంజూరైనా ఇంకా పనులు ప్రారంభం కాలేదు.
- ఒంగోలు- కర్నూలు రహదారిలో చీమకుర్తి బైపాస్, పట్టణ శివారు, అర్‌ఎల్‌పురం, మర్రిచెట్లపాలెం వద్ద రహదారి ప్రమాదకరంగా తయారైంది. కొన్నిచోట్ల పెద్ద పెద్ద గుంతల్లో నీరు నిలిచి ఈత కొలనుల్లా కనిపిస్తున్నాయి. ఇటుగా నిత్యం తిరిగే గ్రానైట్ వాహనాలు, బస్సులు, ఇతర వాహనాల చోదకులకు నరకం కనిపిస్తోంది. అర్‌అండ్‌బీ అధికారులు, క్వారీల నిర్వాహకులు మట్టి పోసి తాత్కాలికంగా గుంతలు పూడ్చినా వానొస్తే పరిస్థితి మళ్లీ మొదటికొస్తోంది.

ఉమ్మడి జిల్లాలో రహదారుల చిత్రమిలా...

- ఆర్‌అండ్‌బీ డివిజన్లు: ఒంగోలు, మార్కాపురం, కనిగిరి
- ఆ పరిధిలో రహదారులు: 3,669 కిలో మీటర్లు
- ఏక వరుస కలిగినవి: 2,700 కి.మీ
- రెండు వరుసలవి: 795 కి.మీ
- అంతర్గత రహదారులు: 133 కి.మీ
- బహుళ వరుసలవి: 33 కి.మీ

66 పనులకు టెండర్లు...

జిల్లాలో గతంలో దెబ్బతిన్న రహదారులను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ప్రభుత్వానికి నివేదించాం. ఒంగోలు, మార్కాపురం, కనిగిరి డివిజన్ల పరిధిలో మొత్తం 66 పనులకు రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టాడానికి టెండర్ ప్రక్రియ నడుస్తోంది. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రహదారులను కూడా గుర్తించి మరమ్మతులకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపాం. – కె.దేవానందం, ఎస్ఈ, ఆర్‌అండ్‌బీ

ఈనాడు, ఒంగోలు, న్యూస్‌టుడే, టంగుటూరు, మార్కాపురం, వై.పాలెం

మనకూ కావాలి డ్రోన్ శక్తి

- అసాంఘిక శక్తులపై అస్త్రం
- ఆపదలో సేవలకు వినియోగం







నేరగాళ్ల ... ఆలోచనలు చేస్తున్నారు. అనుకోని విపత్తులు విరుచుకు పడి ప్రాణ, ఆస్తి నష్టానికి కారణమవుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపడం.. ఆపదవేళ ప్రజలకు తక్షణ సాయం అందించడం ఎంతైనా అవసరం. ఇవే కాకుండా నిత్య జీవితంలో ఎదురయ్యే మరెన్నో సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలంటే సాంకేతిక పరిజ్ఞానమే పరిష్కారం చూపనుంది. ఈ కోవలో అనేక అవసరాలకు డ్రోన్లు ఇప్పుడిప్పుడే అక్కరకొస్తున్నాయి. ఒకప్పుడు కేవలం ఫొటోలు, వీడియో చిత్రీకరణలకే పరిమితమైన డ్రోన్లు.. నేడు బహుళ ప్రయోజనకారి అవతారమెత్తాయి. విజయవాడ నగరాన్ని ఇటీవల వరదలు ముంచెత్తిన సమయంలో ముంపునకు గురైన బాధితులకు అన్నపానీయాలు అందజేయడంలో ఎంతగానో దోహదపడ్డాయి. మెట్రో నగరాల్లో ట్రాఫిక్ నియంత్రణలోనూ పోలీసులు ఈ యంత్రాల సేవలను ఉపయోగించుకుంటూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో మన జిల్లా అవసరాలకూ కావాలి డ్రోన్ శక్తి. ఆ వివరాలివేమిటో తెలుసుకుందాం.

నిర్జన ప్రదేశాలపై నిఘా కళ్లు...

జిల్లాలోని పలు నిర్జన ప్రదేశాలు నేరాలకు అడ్డాలుగా మారాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రం ఒంగోలులోని కొన్ని శివారు ప్రాంతాల్లో గతంలో ఎన్నో హత్యలు చోటుచేసుకున్నాయి. ఇటువంటి ప్రదేశాలకు పోలీసు వాహనాల్లో వెళ్లే ఆస్కారం ఉండదు. నిత్యం పహారా.. గస్తీ కూడా తక్కువగానే ఉంటుంది. ఇటువంటి ప్రాంతాలతో డ్రోన్ల ద్వారా నిఘా పెంచితే నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు కొంతైనా అడ్డుకట్ట పడుతుంది.

ట్రాఫిక్ కట్టడిలోనూ తోడ్పాటు...

జిల్లా కేంద్రంతో పాటు మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు, పొదిలి వంటి పట్టణాల్లో ట్రాఫిక్ రద్దీ నిత్యకృత్యంగా మారింది. ఇరుకు రోడ్లతో పాటు కొందరు ఇష్టారీతిన వాహనాలు నడుపుతుండటం ఇందుకు కారణం. ట్రాఫిక్ సమస్య తలెత్తిన ప్రతి చోటునూ తక్షణమే గుర్తించడం అన్ని వేళలా పోలీసులకు సాధ్యం కాదు. రద్దీ ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగించడం ద్వారా ఈ సమస్యను వెంటనే గుర్తించి పరిష్కరించడం పోలీసులకు సులువు అవుతుంది.

విపత్తుల వేళ.. కాపాడే రెక్కలు...

జిల్లాను ఐదేళ్ల కాలంలో ప్రకృతి విపత్తులు వెంటాడుతున్నాయి. ఏకధాటిగా 10 సెంటీ మీటర్ల వర్షం కురిస్తే చాలు ఒంగోలు మునిగిపోతుంది. రహదారులన్నీ జలమయం అవుతాయి. సముద్ర తీర ప్రాంత గ్రామాలదీ అదే పరిస్థితి. అక్కడి వాసులను పునరావాస కేంద్రాలకు తరలించక తప్పదు. వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్న సమయాల్లో ప్రజలు అందులో చిక్కుకుపోతున్నారు. ఇటువంటి సమయంలో బాధితులకు సహాయం అందించడంలో డ్రోన్లు ఉపయోగపడతాయి. తాజాగా విజయవాడ వరదల్లో డ్రోన్లతో అందించిన సేవలే నిదర్శనం. అధికార యంత్రాంగం ఆ దిశగా ఆలోచించి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ద్వారా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు డ్రోన్లను వినియోగిస్తే సత్ఫలితాలు పొందే అవకాశం ఉంది.



జూదం.. బహిరంగ మద్యపానం అటకట్టు...

శివారు ప్రాంతాల్లో.. కొన్ని ప్రదేశాల్లో గంజాయి ముఠాలు రెచ్చిపోతున్నాయి. ఊళ్లకు దూరంగా పొలాలు, తోటలు, జన సంచారం లేని ప్రదేశాల్లో జూదం, కోడి పందాలు వంటివి నిర్వహిస్తున్నారు. పోలీసులకు కొందరు సవాలు విసురుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిత్యకృత్యమైంది. ఇటువంటి ప్రతి ప్రదేశానికి పోలీసులు నేరుగా వెళ్లే అవసరం లేకుండా నిర్దిష్ట ప్రాంతాల నుంచి డ్రోన్లను ఆపరేట్ చేస్తూ.. జూదరులు, గంజాయి ముఠాల కార్యకలాపాలు వంటి వాటిపై నిఘా పెట్టి కట్టడి చేయొచ్చు.





ఇది పోలీసు బలగం...	ఎస్పీ	అదనపు ఎస్పీలు	డీఎస్పీలు	సీఐలు	ఎస్సైలు	ఏఎస్సైలు	హెడ్ కానిస్టేబుళ్లు	కానిస్టేబుళ్లు
	01	02	06	20	80	119	284	716

ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం:	అదనపు ఎస్పీ	డీఎస్పీ	ఆర్ఐలు	ఆర్ఎస్సైలు	ఏఆర్ ఎస్సైలు	ఏఆర్ హెచ్‌సీలు	ఏఆర్ పీసీలు
	01	01	03	11	35	116	339

– న్యూస్‌టుడే, ఒంగోలు

నేలపాలైన కర్షకుడి కష్టం

- 9,252 హెక్టార్లలో పంట నష్టం
- రైత్వారీ అంచనాలు ప్రారంభం



తడిచి మొలకెత్తిన సజ్జ కంకులు చూపుతున్న రైతు



కనిగిరి మండలం చిన ఇర్లపాడులో వర్షాలకు తడిచిన సజ్జ దిగుబడులు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో వరుసగా కురిసిన భారీ వర్షాలు కర్షకులకు తీరని కష్టాన్ని మిగిల్చాయి. అందిన కాడికి పెట్టుబడులు తెచ్చి సాగు చేసిన పంటలను చేతికందకుండా చేశాయి. జిల్లా వ్యాప్తంగా వేల హెక్టార్లలోని పంటలకు నష్టం కలిగించాయి. ఈ విషయాన్ని మంగళవారం నాటి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. దీంతో నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని మంత్రులు ప్రకటించారు. అన్ని గ్రామాల్లో పంట నష్టాలను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. దీంతో నష్టాన్ని అంచనా వేసే పనులు మొదలయ్యాయి. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా రైతుల పొలాలు పరిశీలించి అంచనా వేయనున్నాయి. ఆ ప్రకారం ఎవరికి ఎంత పరిహారం చెల్లించాలనే విషయమై ప్రభుత్వానికి నివేదిక పంపుతారు. ఇప్పటి వరకు మొత్తం 205 గ్రామాల్లో 8,429 మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఏ పంటకు ఎంతంటే..!: పెట్టుబడి రాయితీ అందించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. నీటి లభ్యత ఆధారంగా సాగు చేసిన వరి, పత్తి పంటలకు హెక్టార్‌కు రూ.17 వేలు చెల్లిస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులను ఇందుకు కేటాయిస్తారు. మొక్కజొన్నకు హెక్టారుకు రూ.12,500, కంది, మినుము, అలసంద పంటలు సాగు చేసిన రైతులకు హెక్టారుకు రూ.10 వేలు అందిస్తారు. పొగాకుకు రూ.10 వేలు చొప్పున, జొన్న, కొర్ర, ఆముదం పంటలకు రూ.8,500, మిర్చి పంటకు రూ.17 వేలు చెల్లించనున్నారు. పంట ఉత్పత్తులు తయారైన వాటికే పెట్టుబడి రాయితీ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. రైతుల ఖాతాలకు నేరుగా జమ చేయడానికి వీలుగా అంచనా సమయంలోనే బ్యాంకు ఖాతా సంఖ్యలు కూడా సేకరించనున్నారు.

జిల్లావ్యాప్తంగా నష్టాల వివరాలు...

పంట	గ్రామాలు	మండలాలు	దెబ్బతిన్న విస్తీర్ణం (హెక్టార్లలో)	రైతులు
సజ్జ	58	12	1,883	1,642
మినుము	36	06	1,379	1,245
జొన్న	01	01	03	02
అలసంద	18	03	1,683	1,587
పత్తి	41	05	3,251	2,987
వరి	04	03	120	98
కొర్ర	04	02	18	11
పొగాకు	43	04	915	857

ఫోన్ చేద్దాం.. పరిష్కరించుకుందాం

- రేపు 'ఈనాడు' ఫోన్ ఇన్



ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లాలో పది రోజులపాటు కురిసిన భారీ వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. నష్ట పరిహారం అందజేయడానికి అధికారులు పరిశీలన చేపట్టనున్నారు. అదే సమయంలో పంటలకు చీడపీడల బెడదా తీవ్రమైంది. మరోవైపు ఈ- క్రాప్ నమోదు, రబీ సాగుకు సెనగ, ఇతర విత్తనాల పంపిణీ సాగుతోంది. ఈ నేపథ్యంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు.. వాటికి పరిష్కార మార్గాలు, పంటలను కాపాడుకునేందుకు సూచనలు.. సలహాలు, పరిహారం అందుకునే క్రమంలో తలెత్తే అనుమానాల నివృత్తికి 'ఈనాడు' చొరవ చూపింది. జేడీఏ, ఉద్యాన శాఖ అధికారి, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహించనుంది. సమస్యను తెలిపితే వారు తగు సమాధానాలిస్తారు. పరిష్కారానికి తమవంతు చర్యలు చేపడతారు. ఇందుకుగాను రైతులు ఈ దిగువ తెలిపిన తేదీలో సదరు నంబరుకు ఫోన్ చేయాల్సి ఉంటుంది.

ఫోన్ ఇన్ తేదీ:	సమయం: ఉదయం	ఫోన్ చేయాల్సిన నంబర్:
25-10-24	9 నుంచి 10 గంటల మధ్య	8331 057048

తల్లితో సహ జీవనం.. కుమార్తెతో ప్రేమాయణం

ఒంగోలు నేర విభాగం, న్యూస్‌టుడే: ఓ మహిళతో సహ జీవనం చేస్తూ.. ఆమె కుమార్తెనూ లోబరుచుకుని అపహరించాడో కామాంధుడు. పోలీసుల కథనం మేరకు... ఒంగోలు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన భర్తకు దూరంగా ఉంటోంది. పదో తరగతి చదువుతున్న కుమార్తెతో వేరుగా జీవిస్తోంది. టంగుటూరు మండలం పొందూరుకు చెందిన ఇండ్లా రాజు అనే వ్యక్తితో కొంతకాలంగా సహ జీవనం చేస్తోంది. ఈ క్రమంలో బాలికను రోజూ పాఠశాలకు తీసుకెళ్లి తీసుకొస్తుండేవాడు. తల్లితో సహ జీవనం చేస్తూ తండ్రి స్థానంలో ఉన్న అతను నైతికతను మరిచాడు. ప్రేమ పేరుతో బాలికకు మాయ మాటలు చెప్పాడు. రెండు రోజుల క్రితం ఇద్దరూ పాఠశాలకంటూ ఇంటి నుంచి బయటికెళ్లారు. సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో బాలిక తల్లి ఒంగోలు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన పోలీసులు.. బాలికతో పాటు నిందితుడు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి ఒంగోలు తీసుకొచ్చారు. రాజుపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

ఆ 57 ఊళ్లలో ఇంకిన కన్నీళ్లు

- పాతాళంలోకి భూగర్భ జలాలు
- నీటి మట్టం పెంపునకు ప్రణాళికలు
- నికరంపల్లెలో ప్రయోగాత్మకంగా అమలు



జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులు ఎక్కువ. భూగర్భ జలాలు పాతాళంలోకి పరుగులు తీస్తుంటాయి. బావులు, బోర్లు ఒట్టిపోయి కనిపిస్తుంటాయి. రక్షిత మంచినీటి పథకాలు అలంకారప్రాయంగా దర్శనమిస్తుంటాయి. సాగుకే కాదు., తాగేందుకు అవసరమైన గుక్కెడు నీటికీ ఇబ్బందులు తప్పవు. వేసవిలోనైతే ఎద్దడి మరింత తీవ్రంగా ఉంటుంది. ఇక్కడ ఎన్నో గ్రామాలకు ఏడాది పొడవునా ట్యాంకర్లతో తాగునీరు సరఫరా చేయాల్సిందే. ఇలాంటి విపత్కర పరిస్థితిలోనూ కొందరు వందల అడుగుల లోతున బోరు బావులు ఏర్పాటు చేస్తున్నారు. పాతాళంలోని కొద్దిపాటి నీటినీ తోడేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే ఆయా ప్రాంతాల్లో మరింత దుర్భర పరిస్థితులు తలెత్తుతాయి. ఈ ప్రమాద ఘంటికలను అధికార యంత్రాంగం గుర్తించింది. ఎనిమిది మండలాల్లోని 57 గ్రామాల్లో తాగునీటి అవసరాలకు మినహా వ్యవసాయం, పరిశ్రమలు, ఇతర అవసరాలకు కొత్తగా బోర్ల తవ్వకంపై నిషేధాజ్ఞల అమలు కొనసాగించనుంది. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల పెంపునకూ ప్రణాళికలు రూపొందించింది. – న్యూస్‌టుడే, ఒంగోలు గ్రామీణం

2020 నుంచి అవే పరిస్థితులు...: పశ్చిమ ప్రకాశంలోని 123 గ్రామాల్లో బోర్ల తవ్వకాన్ని 2020లోనే నిషేధించారు. 2021లో నీటి మట్టం కొంత మెరుగు కావడంతో సదరు ఆంక్షలను 91 గ్రామాలకు పరిమితం చేశారు. గత రెండేళ్లుగా కొన్ని ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కావడం, తద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెందడంతో బోర్ల తవ్వకంపై ఉన్న ఆంక్షలను 57 గ్రామాలకు తగ్గించారు. ఆయా గ్రామాల జాబితాను రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఇటీవల ప్రకటించింది.

అధికారులతో కసరత్తు...: ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు పెంపునకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా నిర్ణయించారు. ఆ మేరకు సంబంధిత అధికారులతో ఇటీవల సమావేశమై కసరత్తు చేశారు. తొలి విడతగా మార్కాపురం మండలం నికరంపల్లె గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేశారు. అక్కడ ఇంకుడు గుంతలతో పాటు, అనువుగా ఉన్న చోట చెక్ డ్యామ్‌లు, వర్షపు నీటిని ఇంకించడం వంటి నిర్మాణాలు చేపట్టనున్నారు. అందుకు ఉపాధి హామీ పథకం నుంచి నిధులు మంజూరు చేయనున్నారు.

ఇవీ భూగర్భ జలాలు పడిపోయిన ప్రాంతాలు...

మండలం	గ్రామాలు
గిద్దలూరు	మోడంపల్లె, చట్టిరెడ్డిపల్లె, గడికోట, కంచిపల్లె, ముండ్లపాడు, కృష్టంశెట్టిపల్లె, నరసింహునిపల్లె, తిమ్మాపురం, సంజీవరావుపేట
కంభం	కంభం, జంగంగుంట్ల, కందులాపురం, ఎల్.కోట
మార్కాపురం	బాదేఖాన్‌పేట, భూపతిపల్లె, బొందలపాడు, చింతకుంట, జమ్మనపల్లె, కోలాభీమునిపాడు, మాల్యాంతునిపాడు, నికరంపల్లె, పెద నాగులవరం, తిప్పాయపాలెం, వేములకోట
పెద్దారవీడు	బద్వీడు, బోయాద గుంపుల, చెట్లమిట్ట, కంభంపాడు, దేవరాజుగట్టు, గొబ్బూరు, ఓబులక్కపల్లె, పెదారవీడు, ప్రగళ్లపాడు, ఎస్.కొత్తపల్లె, సానికవరం, తంగిరాలపల్లె, తోకపల్లె
యర్రగొండపాలెం	అమ్మనిగుడిపాడు, లింగంవానిపల్లె, రామచంద్రాపురం, బిల్లగొండిపేట, నెక్కంటి
పెద్దదోర్నాల	చినదోర్నాల, నల్లగుంట్ల, పెద బొమ్మలాపురం, పెద్దదోర్నాల
పుల్లలచెరువు	చాపలమడుగు, కవలకుంట్ల, కొమరోలు, మర్రివేముల, నరసాపురం, రాచకొండ, శతకోడు, యండ్రపల్లె
రాచర్ల	అకవీడు, చిన్నగనిపల్లె, చొల్లవీడు

గ్రామాల్లో 33 వేల ఇంకుడు గుంతలు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో 33 వేల ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ తెలిపారు. ఉపాధి హామీ పనుల ప్రగతిపై ఒంగోలులో సాంకేతిక సహాయకులతో ఆయన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. మండలానికి వెయ్యి చొప్పున ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో వర్షపు నీటిని భూమిలోకి ఇంకించేలా రూఫ్ వాటర్ సంరక్షణ పనులకు ప్రతిపాదనలు చేయాలన్నారు. సమావేశంలో అధికారులు పి.ఝాన్సీరాణి, వెంకటస్వామి, మధుసూదనరావు పాల్గొన్నారు.

బోధన

❖ వైకాపా పాలనలో పడక
❖ దృష్టి సారిస్తే విద్యార్థులకు సాంత్వన

డిజిటల్ కాంతులీనేనా!



న్యూస్‌టుడే, టంగుటూరు :

ప్రభుత్వ బడుల్లో సాంకేతిక శిక్షణ అంటూ హడావుడి చేసిన గత పాలకులు ఆచరణలో చతికిలపడ్డారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు పూస గుచ్చినట్లు అర్థమయ్యేలా చెబుతూ చిత్రరూపంలో చూపుతూ బోధించే డిజిటల్ బోధన మూన్నాళ్ల ముచ్చటగా మిగిలింది. దీనికోసం వెచ్చించిన కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరైంది. కొత్త ప్రభుత్వం దీన్ని గాడిలో పెట్టాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన కాస్తా గత పాలకుల ప్రణాళికా లేమితో నీరుగారింది. దీనికోసం ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)ను అందించినా నిర్వహణ పట్టించుకోకపోవడంతో అదంతా అడవి గాచిన వెన్నెలైంది. గత ప్రభుత్వం ఫేజ్-1, 2లో సుమారు 2,846 డిజిటల్ తెరలను జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమకూర్చింది. వీటిని అమర్చే బాధ్యత ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. మండల కేంద్రాలు, పట్టణాల్లో సదుపాయాలున్న పాఠశాలల్లో ఈ తెరలను కొంతమేర అమర్చారు.

అంతర్జాల సౌకర్యం కల్పిస్తే ..

వైకాపా పాలకులు మొక్కుబడిగా సాగించిన డిజిటల్ బోధనను కొత్త ప్రభుత్వం గాడిలో పెట్టాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. స్కూళ్లలో ఐఎఫ్‌పీ (ఇంటరాక్ట్ ఫ్లాట్ ప్యానల్) ఆండ్రాయిడ్ బాక్స్, సబ్జెక్ట్ కంటెంట్ మెమరీ చిప్ వంటివి అప్పట్లో అందించారు. ఆ చిప్‌లలో నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆయా తరగతుల వారీగా పాఠ్యాంశాల వివరాలుండేవి. వాటిని నవీకరిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి. అదే సమయంలో డిజిటల్ బోధనకకు అనుగుణంగా అంతర్జాల సౌకర్యం కల్పించాలి. ప్రతి పాఠశాలకు రూ. 5 వేల చొప్పున వెచ్చించడం వల్ల తెరను ఉపయోగంలోకి తీసుకురావచ్చు. వైరింగ్ చేసి ప్యానల్స్ పనిచేసేలా చేస్తే ఫలితం ఉంటుందని వారంటున్నారు.

అట్టపెట్టల్లోంచి తీయనే లేదు..



జమ్ములపాలెం పాఠశాలలో..

గ్రామీణ ప్రాంతాలు, సుదూర గ్రామాల్లోని పాఠశాలల్లో డిజిటల్ బోధన అలంకారప్రాయమైంది. అక్కడి పాఠశాలలకు అందించిన ప్యానల్స్‌ను అట్టపెట్టెల్లోంచి బయటకే తీయనే లేదు. పాఠ్యాంశాలు బోధించేందుకు మొదట్లో ఉపాధ్యాయులకు నామమాత్ర శిక్షణ ఇచ్చారు. ఇక కొన్నిచోట్ల విద్యుత్తు, అంతర్జాల సౌకర్యం లేకపోవడంతో ఇదంతా ఓ మొక్కుబడి వ్యవహారంగా సాగింది.

ఈ విధానంపై సమీక్షించాం

చాలా పాఠశాలల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాలేదు. ఇప్పటికీ అట్టపెట్టెల్లోంచి తీయలేదు. దీనిపై ఉపాధ్యాయులకు సమాచారమిస్తున్నాం. ఇటీవల జరిగిన సమావేశాల్లో ఈ అంశంపై సమీక్షించాం. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో గాడిలో పెడతాం. **– సుబ్బారావు, ఇన్‌ఛార్జి డీఈవో**

రైల్వే పనులకు ప్రతిపాదనలు పంపండి



రైల్వే క్రాసింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ర.భ. అధికారులు

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు రైల్వేక్రాసింగ్ 193, 194 వద్ద ఏర్పాటు చేయాల్సిన సబ్‌వే, ఆర్వో వంతెనల నిర్మాణానికి అంచనాలు వేసి, ప్రతిపాదనలు సత్వరం పంపాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా రహదారులు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. టంగుటూరులోని 193, 194 రైల్వే క్రాసింగ్‌లను ఆమె ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వారితో మాట్లాడుతూ గ్రామంలోని ఈ క్రాసింగ్‌ల వద్ద సబ్‌వే, ఆర్వో వంతెనల నిర్మాణానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. టంగుటూరు గ్రామ ప్రజలతో పాటు సముద్ర తీర గ్రామాలైన ఆలకూరపాడు, అనంతవరం, వెలగపూడి ఇతర గ్రామాలవారు రాకపోకల వేళ ఎదురవుతున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఎస్ఈ దేవానందం, ఈఈ గోపీ నాయక్, ఏఈ నాగార్జున, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 4 నుంచి డీఈఐఈడీ పరీక్షలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రైవేటు కళాశాలల్లో చదివే డీఈఐఈడీ మొదటి సంవత్సరం విద్యార్థులకు నవంబర్ 4 నుంచి 9 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డైట్ ప్రిన్సిపల్ సామా సుబ్బారావు పేర్కొన్నారు. 2018-20 మేనేజ్‌మెంట్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులకు పరీక్ష జరుగుతుందన్నారు.

తమర్ అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయకర్తగా సుధాకరరెడ్డి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ఝార్ఖండ్ రాష్ట్ర తమర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్తగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ నుంచి సమన్వయకర్తల జాబితా విడుదల చేశారు. ఈ బాధ్యతలు అప్పగించడానికి సహకరించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో ప్రకృతి సాగు పెంచేందుకు కృషి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న డీపీఎం సుభాషిణి, వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు

తాళ్లూరు, న్యూస్‌టుడే : జిల్లాలో రసాయనాలు లేని ఆరోగ్యకర ఉత్పత్తులు పండించడమే లక్ష్యమని ప్రకృతి సాగు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.సుభాషిణి తెలిపారు. బెల్లంకొండవారిపాలెం, దోసకాయలపాడు, లక్కవరం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన కార్యక్రమాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 38,500 మంది రైతులతో 42,255 ఎకరాల్లో ప్రకృతి సాగు చేయిస్తున్నట్లు తెలిపారు. వరి పొలం గట్లపై కంది వేసుకోవాలని, ప్రతీ ఇంటా కిచెన్ గార్డెన్లను వేయాలన్నారు. పురుగుల నివారణకు అస్త్రాలను, తెగుళ్ల నియంత్రణకు కషాయాలను ఉపయోగించాలన్నారు. వీటిని వివిధ రకాల మొక్కల ఆకులు, ఆవు మూత్రం, పేడతో సులువుగానే తయారు చేసుకోవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు మాట్లాడారు. రైతులకు వ్యవసాయ అనుబంధ పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలను వారు రైతులతో కలసి ప్రదర్శించారు. ఏవో ప్రసాదరావు, వీపీఏలు భార్గవి, వీరాంజనేయులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



హతవిధీ..రైలు గేటూ ఒంగిపోయె..

వాహనాల రాకపోకలు నిరోధించేందుకు వేసే గేట్లు ఎంతో పటిష్ఠంగా ఉంటాయి. దీనికి భిన్నంగా ఉంది గిద్దలూరులోని రాచర్ల గేటు పరిస్థితి. డబుల్ లైన్ చేసిన సమయంలో తేలికపాటి నాసిరకం గేటు ఏర్పాటు చేశారు. బుధవారం మధ్యాహ్నం గేటు వేస్తుండగా అది కాస్తా ఒంగిపోయింది. రైలు వెళ్లిన తరువాత అది తెరచుకోకుండా చోదకుల సహనానికి పరీక్ష పెట్టింది. ప్రతిసారి తాత్కాలిక మరమ్మతులతో కాలం వెళ్లదీస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. – గిద్దలూరు పట్టణం

ఏకేయూలో క్రీడా పోటీలు ప్రారంభం



ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఉపకులపతి మూర్తి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: క్రీడాపోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి మూర్తి అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఫెన్సింగ్, తైక్వాండో పోటీల సందర్భంగా ఆయన మాట్లాడారు. 54 కిలోల తైక్వాండో పురుషుల విభాగంలో జి.భాస్కర్, 63 కిలోల విభాగంలో ఎం.రంజిత్, 57 కిలోల మహిళ విభాగంలో గిరిజారెడ్డి, 62 కిలోల విభాగంలో ఎం.శైలజ, ఫెన్సింగ్ పురుషుల విభాగంలో నవీన్‌కుమార్‌రెడ్డి, మహిళల విభాగంలో ఆర్.విజయలక్ష్మి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డీడీ దేవీవరప్రసాద్, ప్రిన్సిపల్ రాజమోహన్, వైస్ ప్రిన్సిపల్ నిర్మలామణి, డీన్ సోమశేఖర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

రైళ్లలో నిఘా పెంచండి: రాహుల్ మీనా

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రైళ్లలో నిఘా పెంచి.. నేరగాళ్ల కదలికలపై సమాచారం ఉండాలని గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రైల్వే సీఐ కార్యాలయంలో రైల్వే సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. దొంగతనాలు, దోపిడీ కేసుల్లో దర్యాప్తుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు రైళ్లలో గస్తీ పెంచాలన్నారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. దోపిడీ, దొంగతనాల కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేసి చోరీ సొత్తు రికవరీ చేయాలన్నారు. అనంతరం నెల్లూరు రైల్వే పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. సమావేశంలో నెల్లూరు, ఒంగోలు రైల్వే సీఐలు భుజంగరావు, షరీఫ్, సూళ్లూరుపేట, నెల్లూరు, ఒంగోలు, చీరాల ఎస్సైలు చెన్నకేశవరావు, మాలకొండయ్య, అరుణకుమారి, కొండయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల ఆన్‌లైన్ నమోదు పూర్తి చేయాలి



సి.ఎస్.పురంలో వెబెక్స్ సమావేశంలో పాల్గొన్న ఎంఈవోలు

పామూరు, న్యూస్‌టుడే: జిల్లాలో ఒకటి మొదలు ఇంటర్ వరకు చదివే విద్యార్థుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వచ్చే నెల 30లోగా పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు స్పష్టం చేశారు. బుధవారం ఆయన అపార్, ఇతర విద్యా అంశాలపై ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, ఇతర విద్యా శాఖాధికారిరులతో వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ విద్యావిధానంలో భాగంగా ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) అందిస్తామన్నారు. తొలుత 9, 10 తరగతులు, ఇంటర్ చదివే విద్యార్థుల వివరాలు మాత్రమే నమోదు చేయాలని చెప్పామన్నారు. నవంబరు 14న పాఠశాలల్లో మెగా తల్లి దండ్రుల సమావేశాలను నిర్వహించాలని తల్లిదండ్రులకు ఆటల పోటీలు వంటివి జరపాలన్నారు. పాఠశాల సముదాయాల పున:వ్యవస్థీకరణ పూర్తి అయిందని వీటిపై ఏమైనా అభ్యంతరాలుంటే ఒకటి రెండురోజుల్లో తెలియజేయాలన్నారు. ఎఫ్ఏ-1 పరీక్షల మార్కులను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ఎఫ్ఏ-2 పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు జె.ప్రసాదరావు, ఆర్.కొండారెడ్డి, జి.కురుణకుమారి పాల్గొన్నారు.

సెపక్‌తక్రాలో సత్తా చాటిన ప్రకాశం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. జిల్లా సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ నగరపాలకోన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ప్రారంభమైన 34వ రాష్ట్ర స్థాయి సీనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. మహిళల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ, పశ్చిమగోదావరి ద్వితీయ, కర్నూలు, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం దక్కించుకున్నాయి. పురుషుల విభాగంలో కర్నూలు జట్టు ప్రథమ స్థానం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జట్టు ద్వితీయ, శ్రీకాకుళం, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం సొంతం చేసుకున్నాయి. విజేతలకు మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, పురపాలక మాజీ అధ్యక్షురాలు ఎంవీ పద్మావతి, సెపక్‌తక్రా జిల్లా ఛైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.స్వరూప్, జి.అర్జున్‌రావు రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 130, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్- 251

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల వాయిదాకు వినతి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నవంబర్ 5వ తేదీ నుంచి జరగాల్సిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డీవీఆర్.మూర్తికి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత నెల రోజులుగా వర్షాలు పడి విద్యాసంస్థలు ఎక్కువ రోజులు పనిచేయకపోవడంతో సిలబస్ పూర్తి కాలేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ వీసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీహెచ్.శ్యామ్, బాలాజీ, సతీష్, కోటి పాల్గొన్నారు.

ప్రభుత్వ సానుకూల స్పందనతో ధర్నా వాయిదా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందున యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ డైరెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా వాయిదా వేసినట్లు యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి చింతలపాటి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. టీచర్ల ఉద్యోగోన్నతులు, ఇతర డిమాండ్లపై పాఠశాల విద్యా కమిషనర్‌తో జరిపిన చర్చలు ఫలించాయన్నారు. ఉన్న ఖాళీల్లో వెంటనే ఉద్యోగోన్నతులు ఇచ్చేందుకు అంగీకరించారన్నారు. 117 జీవో రద్దు చేయాలని నిర్ణయించినందున కొత్త నిబంధనలు వెంటనే రూపొందించి అప్‌గ్రేడ్ చేయాల్సిన పోస్టులు గుర్తించి ఉద్యోగోన్నతులు ఇవ్వడానికి సుముఖత చూపారన్నారు. పీఎఫ్, బోధనేతర సిబ్బంది నియామకం సమస్యలపై త్వరలో నిర్ణయం తీసుకుంటారన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లతో పాటు మున్సిపల్ టీచర్లకు కూడా బదిలీల చట్టం రూపొందించి ఏప్రిల్ తరువాత బదిలీలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పూరిమెట్లలో గుప్త నిధులకు తవ్వకాలు

❖ విగ్రహాల్ని పెకిలించిన దుండగులు



విగ్రహాన్ని తొలగించి తవ్విన భారీ గుంత

ముండ్లమూరు, న్యూస్‌టుడే: గుప్త నిధుల కోసం పురాతన ఆలయంలో తవ్వకాలు జరపడం కలకలం రేపింది. ముండ్లమూరు మండలం పూరిమెట్ల గ్రామ సమీపంలో కొండ తిప్ప పైన ఉన్న వేణుగోపాల, ఆంజనేయ స్వామి ఆలయం వద్ద దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి దూరంగా ఆలయం ఉండటంతో అటువైపు పెద్దగా జన సంచారం లేదు. మంగళవారం స్థానిక యువకులు అక్కడికి వెళ్లారు. విగ్రహాల్ని పెకిలించి వేసిన విషయాన్ని వారు గుర్తించారు. ఆంజనేయస్వామి విగ్రహం పక్కన పెద్ద గుంత తవ్వారు. వేణుగోపాలస్వామి ప్రతిమను బయట పడేశారు. గతంలోనూ ఇక్కడ దుండగులు పలుమార్లు తవ్వకాలు జరిపారని స్థానికులు చెబుతున్నారు.

సొత్తు దోచుకుని ఇంటికి నిప్పు !



పిచ్చిరెడ్డి కాలనీలో దగ్ధమైన ఇల్లు

పొదిలి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ ఇల్లు అగ్నికి ఆహుతైంది. దుండగులు నగదు, బంగారు ఆభరణాలు దోచుకుని..ఆపై నిప్పు పెట్టి ఉంటారని బాధితులు వాపోయారు. ఈ సంఘటన పొదిలి పిచ్చిరెడ్డి కాలనీలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పిచ్చిరెడ్డి కాలనీకి చెందిన బి.రమణమ్మ, కుమారుడు మధు పది రోజుల క్రితం ఉపాధి నిమిత్తం ఒంగోలు వెళ్లారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆమె ఇంటిలోంచి మంటలు రావడాన్ని స్థానికులు గమనించారు. వెంటనే ఇంటి తాళం పగులగొట్టి వాటిని అదుపుచేసి యజమానురాలికి సమాచారమిచ్చారు. బాధితులు వచ్చి పరిశీలించగా..ఇంటి కిటికీ అద్దం పగులగొట్టిన ఆనవాళ్లతో పాటు రక్తపు మరకలు కన్పించాయి. ఇంట్లో ఉన్న రూ.50 వేల నగదు, ఆరు సవర్ల బంగారు ఆభరణాలు కన్పించలేదు. దుండగులు కిటికీ పగులగొట్టి లోనికి ప్రవేశించి సొత్తు దోచుకుని, ఆపై నిప్పు పెట్టారని రమణమ్మ కుమారుడు మధు అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

కంభం, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ బుధవారం వేకువజామున పట్టుకున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని కుంట నుంచి తమిళనాడు రాష్ట్రం బంగారుపేటకు అక్రమంగా బియ్యం తరలుతోందన్న సమాచారంతో సబ్ కలెక్టర్ స్థానిక రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే కంభంలోని కందులాపురం కూడలికి చేరుకున్న సబ్ కలెక్టర్, అధికారులు వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ మేరకు అందులో ఉన్న సుమారు 630 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బేస్తవారపేట తహసీల్దార్ జితేంద్ర, వీఆర్వోలు పీర్సా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



లారీ వద్ద సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ జితేంద్ర తదితరులు

సాగర్ కాలువలో దూకుతున్నానంటూ ఫోన్ చేసి..



షేక్ రఫీ (పాతచిత్రం)

దర్శి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో సాగర్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని భార్యకు వీడియో కాల్ చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల మేరకు..పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన షేక్ రఫీ (40) దర్శికి చెందిన సాదియాను పద్నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భార్యా, పిల్లలు దర్శిలో ఉంటుండగా రఫీ బేల్దారీ మేస్త్రీగా పనులు చేసుకుంటూ వినుకొండ, దర్శిలో ఉంటున్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా గొడవలు జరుగుతుండటంతో రఫీ వినుకొండకు వెళ్లిపోయారు. గత సోమవారం బ్యాంకు పనిపై ఆయన దర్శికి రాగా, దంపతుల మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కురిచేడు రోడ్డులో సాగర్ లాకుల వద్ద గట్టుపై నిలబడి భార్యకు వీడియో కాల్‌చేశారు. తాను కాలువలో దూకుతున్నానని చెప్పి ఫోన్ కట్ చేయగా, ఆమె ఆందోళనకు గురై వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై మురళి సిబ్బందితో సంఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించగా, కాలువ గట్టుపై రఫీ చెప్పులు, చరవాణి ఉన్నాయి. కాలువ వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు భార్య సాదియా తమకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి దుర్మరణం

కలసపాడు, న్యూస్‌టుడే: వైఎస్ఆర్ జిల్లా కలసపాడు మండలపరిధిలోని గిద్దలూరు ప్రధాన రహదారిపై శింగరాయపల్లె వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేల్దారి షేక్ మస్తాన్‌వలి (42) దుర్మరణం చెందారు. మండలపరిధిలోని కలసపాడు నుంచి తంబళ్లపల్లెకు బేల్దారి షేక్ మస్తాన్‌వలి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఓ వాహనం ఢీకొంది. ఘటనలో మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందారు. మార్కాపురానికి చెందిన మస్తాన్‌వలికి ఆరేళ్ల కిందట తంబళ్లపల్లెకు చెందిన షేక్ ఖాతిజాబీతో వివాహమైంది. అప్పటి నుంచి తంబళ్లపల్లెలోనే ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

చీమకుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పి. గుడిపాడు వెళ్లే దొంక పక్కనున్న చిల్ల చెట్లలో సుమారు 45 ఏళ్ల వయసున్న వ్యక్తి మృతదేహాన్ని బుధవారం కొందరు వ్యక్తులు గుర్తించారు. వారు రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వగా సంఘటనాస్థలానికి చేరుకున్న పి. గుడిపాడు వీఆర్వో చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. పది, పదిహేను రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఎలాంటి ఆనవాళ్లు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.

మార్కాపురం

•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం




మార్కాపురం: పోటీలో పాల్గొన్న విద్యార్థులు, గెలుపొందిన వారితో ప్రిన్సిపల్ మల్లికార్జున, సిబ్బంది

ప్రతిభా పరీక్షలతో విజ్ఞానం పెంపు

మార్కాపురం పట్టణం : పట్టణంలోని వివేకానంద విద్యాపీఠంలో బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో 9వ తరగతి చదువుతున్న ఎస్.భూమిక, ఆర్ఎస్ఎస్. దీక్షిత్, సీహెచ్.హర్షిణి వరుసగా మొదటి, రెండో, మూడో బహుమతి గెలుచుకున్నారు. వీరికి ప్రిన్సిపల్ ఆర్.మల్లికార్జున, ట్రెజరర్ బీవీ.సుధాకరరావు ఇతర సిబ్బంది బహుమతులు అందజేశారు.

కంభం: స్థానిక వాసవి విద్యానికేతన్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'అంతర్జాల వినియోగం వల్ల లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన వ్యాస రచనలో విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్.రామకృష్ణ (10), ఓ కౌశిక్ (9), ఎం.జాగృతి (8 తరగతి) విద్యార్థులు మొదటి మూడు బహుమతులు అందుకున్నారు. వారికి ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌వర్మ, ఉపాధ్యాయుడు జావెద్ బహుమతులు అందజేశారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.




కంభం : వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు, విజేతలతో ప్రధానోపాధ్యాయుడు కిరణ్‌వర్మ, జావెద్

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి : పొదిలి ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజరు జె.సుందరరావు తెలిపారు. పొదిలి, కొనకనమిట్ల, దర్శి, దొనకొండ, కురిచేడు, మర్రిపూడి మండలాల ప్రయాణికులు తమ సమస్యలను ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 9959225700 నంబరుకు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

దస్త్రాల పరిశీలన

పెద్దదోర్నాల : స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. భూరికార్డులు సక్రమంగా ఉంచాలని, ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆయన సిబ్బందికి సూచించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు.

లెక్కలతో సరి పెడితే ఎలా?

● నేటికీ అందని గత ఏడాది నష్టపరిహారం
● ఇప్పుడు వర్షాలతో అదనపు దెబ్బ

మార్కాపురం, న్యూస్‌టుడే:

గత ఏడాదికి సంబంధించిన నష్టపరిహారానికే దిక్కులేదు. ప్రస్తుతం వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టం అంచనా వేసినా.. అది వచ్చేదెప్పుడోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడు తీవ్ర నీటి ఎద్దడితో సకాలంలో వర్షాలు పడక పంటలు ఎండిపోతే.. ఈ ఏడాది ఎడతెరిపిలేని వర్షాలు తమను దెబ్బతీశాయని రైతులు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులు ఆదుకునేందుకు పశ్చిమ ప్రాంతాన్ని కరవు ప్రాంతంగా ప్రకటించడంతో అధికారులు సబ్ డివిజన్‌లో 5940 మంది రైతులకు గాను 4730.58 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు జిల్లా అధికారులకు నివేదికలు పంపించారు. కేంద్ర బృందం సభ్యు పరిశీలించి వెళ్లి ఏడాది అయినా నేటికి రైతులకు ఒక్క రూపాయి అందలేదు. దీంతో ప్రస్తుతం పంటల నష్ట పరిస్థితి ఏమౌతుందోనని రైతులు పేర్కొంటున్నారు..

మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మార్కాపురం, తర్లుపాడు, అర్ధవీడు, పెద్దారవీడు, కంభం మండలాల్లో గత ఏడాది రబీలో సాగు చేసిన పంటలు అన్ని పూర్తిగా నష్టపోయారు. ఒక్క రైతుకు కూడా పంట పండలేదు. కనీసం ఒక్క క్వింటా దిగుబడి రాకపోవడంతో రైతులు కరవులో నిండామునిగిపోయారు. వ్యవసాయ పంటలతో పాటు ఉద్యానవనశాఖ పంటలు కూడా నష్టపోయాయి. డివిజన్‌లో మొత్తం 5940 మంది రైతులకు గాను 4730.58 ఎకరాల్లో పంట నష్టం జరిగితే రైతులకు బ్యాంకు ఖాతాల్లో రూ.4,65,51,021 కోట్లు పంట నష్టం పెండింగ్‌లో ఉంది. గత ఏడాది నుండి రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. అధికారులు పంట నష్టం లెక్కలు వేసుకొని వెళ్లడమే గానీ సకాలంలో పంట నష్టం వేయరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ప్రస్తుత వర్షాలకు కె.కొత్తపల్లెలో దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, రైతులు

ప్రస్తుత నష్టం.. అంచనాలెప్పుడో?

వారం రోజులుగా కురిసిన వర్షాలకు సాగు చేసిన వరి, పత్తి, మిరప, కంది, పొగాకు, జొన్న, మొక్కజొన్న, ఉద్యానవన పంటలు దెబ్బతింటున్నాయి.



గత ఏడాది కరవుతో కోమటికుంట సమీపంలో ఎండిపోయిన పత్తి పంట

మార్కాపురం వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మార్కాపురం, తర్లుపాడు, అర్ధవీడు, పెద్దారవీడు, కంభం మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 45,318 ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగు చేశారు. పత్తికి తీవ్రంగా నష్టం జరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఉద్యానవన పంటలు దోస, బెండ, దొండ, కాకర, టమోటా, క్యాప్సికం, గోంగూర, తోటకూర, పాలకూర పంటల సాగు నష్టపోయాయని, వీటికి ఎప్పుడు పరిహారం వస్తుందోనని రైతులు వాపోతున్నారు. పంట నష్టం అంచనాలు ఎప్పుడో వేస్తారో...ఎప్పుడు ఆ నష్టపరిహారం వస్తుందోనని రైతులు వాపోతున్నారు.

రూ. 2 లక్షల నష్టం



గత ఏడాది 4.50 ఎకరాల్లో పత్తి, జొన్న సాగు చేశా. రూ.2లక్షలు పెట్టుబడి పెట్టా. వర్షాలు పడక రెండు పంటలూ ఎండు ముఖం పట్టి పూర్తిగా నష్టపోయా. ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదు. ప్రతి ఏడాది కరవుతో పాటు ప్రకృతి వైపరీత్యాలు వస్తున్నాయి. రైతులం నష్టపోతున్నాం. ప్రభుత్వం నష్టపరిహారం త్వరగా విడుదల చేయాలి. – ఉడుముల రమణారెడ్డి, జమ్మనపల్లె, మార్కాపురం

రక్తదాన శిబిరం

మార్కాపురం : పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం మార్కాపురంలోని తితిదే కల్యాణమండపంలో రక్తదాన శిబిరాన్ని సీఐ సుబ్బారావు ప్రారంభించారు. ఈ శిబిరంలో 82 మంది రక్తం దానం చేశారు. వీరిని నాయకులు, సీఐ, ఎస్సైలు అభినందించారు.

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు

పొదిలి గ్రామీణం : పొదిలి పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారి దీక్షా మాలను ధరించారు. అనంతరం స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, పూజారులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరీపై సభ్యుల ఆగ్రహం

● వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

కొనకనమిట్ల,న్యూస్‌టుడే : కీలకమైన సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ఎంపీటీసీ సభ్యుడు రాంనారాయణరెడ్డి ప్రశ్నించారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అటవీ, నీటిపారుదల, దేవాదాయ శాఖ, సాగర్ నీటి సరఫరా అధికారి, ఆర్అండ్‌బీ, రహదారి భవన శాఖ హాజరు కాలేదు. గత సమావేశానికి హాజరు కాకపోవటంతో నోటీసులు జారీ చేసినా అధికారుల తీరులో మార్పు రాకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ మురళీకృష్ణ హెచ్చరించారు. పలు గ్రామాలకు సాగర్ నీరు సరఫరా కావడం లేదని పలుమార్లు విన్నయించి సమస్యలు పట్టించుకోవడలేదని పలు సర్పంచులు ఆరోపించారు. నెలలు సమయం సచివాలయం సిబ్బంది పనులు చేయకుండా కార్యాలయం రాకపోయినా సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదని అధికారులపై జడ్పీటీసీ సభ్యుడు ఏడుకొండులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మూడు నెలలు ఒకసారి నిర్వహించే సమావేశంలో గ్రామాల సమస్యలు పరిష్కారం కావడం అన్నారు. కార్యక్రమంలో ఏవో రంగ ప్రసన్నలక్ష్మి, ఈవోఆర్డీ శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యుడు ఏడు కొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, ఎంఈవో డాంగే పాల్గొన్నారు.



సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ ప్రశ్నిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రాంనారాయణరెడ్డి

పొలాల్లో నీరు...ఉరకెత్తిన పంటలు

త్రిపురాంతకం గ్రామీణం, న్యూస్‌టుడే: అల్పపీడనం ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో మిర్చి, పొగాకు, కంది, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో మిర్చి 7 వేల ఎకరాలు, పొగాకు 400, మొక్కజొన్న 1,267, వరి 4,300, కంది 2,100 ఎకరాల్లో సాగు చేశారు. పలు గ్రామాల్లో సాగు చేసిన మిర్చి, పొగాకు, మొక్కజొన్న, వరి పొలాలు దెబ్బతిన్నాయి. రామసముద్రం రేగడి నేలల్లో సాగు చేసిన పొగాకు ఉరకెత్తి ఎర్రగా ఎండిపోతోంది. లేళ్లపల్లి, చెర్లోపల్లిలో కొట్టుడుకు వచ్చిన పొగాకు తడవడంతో రంగు మారింది. మేడపి, గణపవరం, అన్నసముద్రం తదితర చోట్ల మొక్కజొన్న నీరు నిల్వ చేరడంతో ఎండిపోతున్నాయి. రామసముద్రం, మిట్టపాలెం తదితర చోట్ల సాగులోని కంది ఉరకెత్తి ఎండిపోతుంది. అన్నసముద్రం పొలాల్లో వేసిన వరి నాట్లు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



దెబ్బతిన్న పొగాకు పంట

పెట్టుబడి నష్టపోయా



ఎకరన్నర పొలంలో పొగాకు సాగు చేశాను. పెట్టుబడులు పూర్తయి పంట కోత దశకు చేరడంతో ఆకులు తీద్దామనే సరికల్లా ఎడతెరిపి లేని వర్షాలతో ఆకు రంగు మారింది. పంటలో నీరు నిల్వ ఉండటంతో ఉరకెత్తి ఎండిపోతోంది.ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి పెట్టా. వర్షం దాటికి పంట చేజారడంతో తీవ్రంగా నష్టపోయా.
– టి.నర్సిరెడ్డి, రైతు, రామసముద్రం, త్రిపురాంతకం మండలం

ఎట్టకేలకు రహదారికి మోక్షం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం లోని వినుకొండ రోడ్డు మోకాలు లోతు గుంతలతో నీరు చేరి ఒక చిన్న చెరువులా తలపించేది. ఈ రహదారి నుంచే రాజధాని అమరావతికి వాహనాలు వెళ్తుంటాయి. ఈ రహదారిలో వివిధ డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారిని డబుల్ రోడ్డు చేయిస్తానని అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ హామీ ఇచ్చారు. అయిదేళ్ల వైకాపా ప్రభుత్వం తట్ట మట్టి పోయలేదు. దీంతో ఈ రహదారి అధ్వానంగా మారింది. ఈ రోడ్డు పరిస్థితి చూసిన తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తన సొంత నిధులు రూ.1.5లక్షలతో పనులు చేయించారు. జేసీబీ, ట్రక్కులతో కంకర, ఇతర సామగ్రిని తెప్పించి వాగును తలపిస్తున్న ఈ రోడ్డును బాగు చేయించారు.



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658
పొదిలి : 8008550360
కంభం : 8008632343

కంభం, న్యూస్‌టుడే



సమస్య : హజరత్ గూడెం పంచాయతీ పరిధి లోని షిర్డీ సాయిబాబానగర్ నుంచి ఆల్ఫా పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. బాగు చేయించండి. – రమణ, స్థానికుడు

సమాధానం : రహదారిని బాగుకు చర్యలు తీసుకుంటాం. – విజయలక్ష్మి, ఈవోపీఆర్డీ, కంభం

పిచ్చిమొక్కల తొలగింపు

స్పందనకు వందనం

బేస్తవారపేట, న్యూస్‌టుడే : బేస్తవారపేట లోని స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో రహదారి పక్కన ఏర్పాటు చేసిన పరివర్తకాల చుట్టూ పెరిగిపోయిన పిచ్చి మొక్కలను విద్యుత్తుశాఖ సిబ్బంది బుధవారం తొలగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పరివర్తకాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి విద్యుత్తు సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతోంది. ఈ సమస్యపై మంగళవారం 'ఈనాడు'లో 'మేమున్నాం.. మీకు తోడుగా'లో వార్త ప్రచురితమైంది. దీనిపై విద్యుత్తుశాఖ ఏఈ సన్యాసిరావు స్పందించి సిబ్బందితో పిచ్చిమొక్కలను తొలగించారు.

ఘర్షణతో యువకుడికి గాయాలు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలైన సంఘటన బుధవారం రాత్రి పెద్దదోర్నాలలో చోటుచేసుకుంది. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో దోర్నాలకు చెందిన సాయి, ఎగువ చెర్లోపల్లెకు చెందిన మాటా రమేష్‌ల మధ్య వివాదం చోటు చేసుకుంది. సాయి రాయితో రమేష్ తలపై, పొట్టపై కొట్టడంతో అతను గాయపడ్డాడు. క్షతగాత్రునికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.. రమేష్ ఫిర్యాదు మేరకు ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రమణమ్మకు సేవారత్న పురస్కారం

యర్రగొండపాలెం పట్టణం : యర్రగొండపాలెంకు చెందిన వి.రమణమ్మ అంగన్‌వాడీగా చిన్నపిల్లలకు అందించిన సేవలకు గాను సేవారత్న అవార్డును అందుకున్నారు. హైదారాబాద్‌లో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో మంగళవారం మహాత్మాగాంధీ జయంతి అహింసా దినోత్సవ ముగింపు ఉత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా రమణమ్మకు తెలంగాణ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానందగుప్తా, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ శాసన మండలి డిప్యూటీ ఛైర్మన్ డాక్టర్ బండ ప్రకాశ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రమణమ్మ

కొద్దిపాటి వర్షానికే అధ్వానం

● పక్కా కాలువలు లేక ఇబ్బందులు ● తొలగని మురుగు

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే :

గిద్దలూరు నగర పంచాయతీలో పక్కా కాలువ వ్యవస్థ సక్రమంగా లేక కొద్దిపాటి వర్షానికే పలు వీధుల్లో రహదారులపై వర్షపునీరు, మురుగు నీరు పారుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాలువల్లో పూడిక తొలగింపునకు నిధులు మంజూరు చేశారు. అయితే ఇప్పటికే పలు ప్రాంతాల్లో కాలువ లోని మురుగు తొలగించిన గుత్తేదారులకు సకాలంలో నగర పంచాయతీ అధికారులు బిల్లులు చేయడం లేదు. ఫలితంగా పూడికతీత పనులు మంజూరైనప్పటికీ అధికారులు బిల్లులు చేయకపోవడంతో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. బిల్లుల చెల్లింపులకు సంబంధించి వివరాలను సమాచార హక్కు చట్టం ప్రకారం దరఖాస్తు చేస్తున్నారని ఓ వ్యక్తి పేరు చెప్పి బిల్లులు చేయకుండా ఇంజినీరింగ్ అధికారులు మిన్నకుండి పోతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత వైకాపా పాలనలో పనులు చేయనప్పటికీ ఇష్టానుసారంగా బిల్లులు చేసిన అధికారులు అప్పటి గుత్తేదారులు ఇబ్బడిముబ్బడిగా ముడుపులు అందజేశారని, ప్రస్తుతం అలాంటి ముడుపులు ఇవ్వరన్న సంకేతాలతో సిబ్బంది పనులు చేపట్టిన బిల్లులు చేయకుండా మిన్నకుండి పోతున్నారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. గిద్దలూరు నగర పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షాలకు పాండురంగారెడ్డినగర్, జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల పక్కన ఉన్న రహదారి, మాజీ మంత్రి పిడతల రంగారెడ్డి ఇంటి రహదారుల్లో పక్కా కాలువలు సక్రమంగా లేక రహదారులపై మురుగు నీరు పారాయి. దీంతో ఆ సమయంలో ప్రజలు ఆ మురుగు నీటిలో అవస్థలు పడి నడిచి పోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కాలువల్లోని పూడికను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలల వద్ద ఇలా..



పాండురంగారెడ్డినగర్‌లో రహదారిపై మురుగు

వాహనాల తనిఖీ

గిద్దలూరు పట్టణం: ట్యాక్సీ బోర్డులు ఉన్న కార్లను మాత్రమే బాడుగలకు తిప్పాలని మార్కాపురం మోటారు వాహనముల తనిఖీ అధికారి అల్లం మాధవరావు కార్ల ఓనర్లకు సూచించారు. ఆయన బుధవారం గిద్దలూరు నగర పంచాయతీలోని కారు స్టాండ్ వద్ద కారు యజమానులతో సమావేశం నిర్వహించారు. సొంత వాహనాలను బాడుగులకు తిప్పుతున్నారని ఫిర్యాదులు అందాయని, అలా సొంత వాహనాలను బాడుగులకు తిప్పనట్లయితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. సొంత వాహనాలను బాడుగకు తిప్పుకోవాలంటే ట్రాన్స్‌పోర్ట్ వాహనంగా మార్చుకోవాలని సూచించారు.

నాణ్యమైన భోజనం పెట్టండి

మార్కాపురం: గ్రామాన్ని, తల్లిదండ్రులను వదిలి దూరంగా పట్టణంలో వసతి గృహంలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారంతో పాటు వారి వసతికి చర్యలు తీసుకోవాలని మార్కాపురం మండల న్యాయసేవాధికార సంస్థ ప్రతినిధులు సంక్షేమ అధికారికి సూచించారు. బుధవారం న్యాయవాదులు పి.రామచంద్ర, ఎం.అన్వర్‌బేగ్‌లు పట్టణంలోని ఎస్టీ కళాశాల ప్రభుత్వ వసతి గృహాన్ని తనిఖీ చేశారు.

నీట్‌లో సత్తా చాటాడు

మార్కాపురం పట్టణం: పట్టణానికి చెందిన ఎస్‌కె.మహమ్మద్ నిహాల్ జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్షలో సత్తా చాటి ఎంబీబీఎస్ సీటు దక్కించుకున్నట్లు జ్ఞానశ్రీ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఎం.మల్లికార్జునరావు తెలిపారు. బుధవారం ప్రకటించిన ఈ ఫలితాల్లో మొత్తం 380మార్కులు సాధించి ఎన్‌సీసీ కోటాలో సీటు దక్కించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థికి పలువురు అభినందనలు తెలిపారు

క్షణం క్షణం.. భయం భయం

● వర్షాలకు ఉరుస్తూ... ● శిథిలావస్థల్లో కార్యాలయాలు



పొదిలి : కొత్తురు విద్యుత్తు ఉపకేంద్రంలో వర్షానికి దస్త్రాలు తడకుండా ప్లాస్టిక్ కవరు కప్పిన దృశ్యం

త్రిపురాంతకం గ్రామీణం, పొదిలి, న్యూస్‌టుడే:

త్రిపురాంతకంలోని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో అధికారులు, సిబ్బంది నిత్యం భయాందోళనలతో గడుపుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పగిలిపోయిన రేకుల రంధ్రాల్లో నుంచి నీరు కారుతూ కార్యాలయం అంతా నీటి చెమ్మ ఎక్కి దస్త్రాలు, కంప్యూటర్లు, ప్రింటర్ తడుస్తున్నాయి. కార్యాలయం గోడలతో పాటు బీరువాలు. కంప్యూటర్లు, ప్రింటర్‌కు విద్యుత్తు ప్రసరిస్తోంది. ఈ నేపథ్యంలో ఎక్కడ ఏమి ముట్టుకుంటే షాక్ కొడుతుందోననే భయంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ◆ పొదిలి కొత్తూరులోని విద్యుత్తు ఉపకేంద్రం కార్యాలయం భవనం ఉరుస్తుండటంతో సిబ్బందికి అసౌకర్యంగా మారింది. విద్యుత్తుశాఖ ఏఈ, సిబ్బంది రెండు చిన్నగదుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు గదుల్లోను స్లాబు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. వర్షానికి ఉరుస్తుండటంతో దస్త్రాలు తడవకుండా ప్లాస్టిక్ కవరు కప్పారు. ఓ మూలకు కంప్యూటర్లు పెట్టుకొని పనిచేయాల్సి వస్తుంది. సుమారు 30 ఏళ్లక్రితం కట్టిన భవనం కావడంతో స్లాబు క్రింద, పైన దెబ్బతింది. నలుగురు సిబ్బంది అక్కడకు వచ్చిన, వినియోగదారులు అధికారులతో మాట్లాడేందుకు వెళ్లిన కూర్చొవడానికి సైతం వసతి లేదు. కురుస్తున్న వర్షాలకు ఎప్పుడు ఏమి జరుగుతుందోనని సిబ్బంది భయం.. భయంగా విధులు నిర్వహిస్తున్నారు.



త్రిపురాకంతకం : రేకులు పగిలి రంధ్రాలతో కనిపిస్తున్న పశు సంవర్ధక సహాయ సంచాలకుల కార్యాలయం

గాయపడ్డ గేదెకు చికిత్స

పొదిలి : పొదిలి-కొనకనమిట్ల మార్గంలో బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొని గేదె తీవ్రంగా గాయాలై పడిపోయింది. అటుగా వెళ్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి కె.బేబిరాణి గేదెను గమనించారు. వెంటనే తన వాహనాన్ని ఆపి 1962 నెంబరుకు ఫోన్‌చేసి (సంచార పశువైద్య వాహనానికి) సమాచారం ఇచ్చారు. సిబ్బంది అక్కడికి వచ్చి గేదెకు ప్రాథమిక చికిత్స అందించి అనంతరం పొదిలి ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు.

జూదరుల అరెస్టు : పుల్లలచెరువు, న్యూస్‌టుడే : ముటుకులలో నిర్వహిస్తున్న జూదశిబిరంపై బుధవారం దాడి చేసి అయిదు మందిని అదుపులోకి తీసుకున్నామని, వారి నుంచి రూ 6100లను నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంపత్ కుమార్ తెలిపారు

నష్ట పరిహారం చెక్కు అందజేత

మార్కాపురం : పెద్దారవీడు మండలంలోని గుండంచెర్ల అటవీ ప్రాంతంలో ఆగస్టు నెలలో అడవి కుక్కలు దాడి చేసిన ఘటనలో చనిపోయిన పశువులకు నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి పంపిస్తే మంజూరైనట్లు మార్కాపురం అటవీక్షేత్ర అధికారి వరప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక అటవీశాఖ కార్యాలయంలో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.35 వేల చెక్కును పశువుల కాపరి అయిన వేల్పుల కృష్ణారెడ్డికి అధికారులు చెక్కును అందజేశారు.

బాధ్యతల స్వీకరణ

పెద్దారవీడు: మండల విద్యుత్తు ఏఈగా ఏరువ నాగేంద్రరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

మర్రిపూడి, న్యూస్‌టుడే:

సమస్య: ఇటీవల కురిసిన వర్షాలకు మర్రిపూడి పంచాయతీలోని పొట్టిరెడ్డిపాలెం రామాలయం వీధి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో నడిచి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. - నరసయ్య, స్థానికుడు

సమాధానం: పరిశీలించి వీధిలో మట్టి తోలి చదును చేయిస్తాం. - శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి

కనిగిరి

• కనిగిరి • దర్శి • కొండపి

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కొండపి గ్రామీణం: మండలంలోని కె. ఉప్పలపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి అవినాష్ రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ఎ. రవికిరణ్ బుధవారం తెలిపారు. స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22న ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో అతడు పాల్గొని ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవినాష్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునన్దకుమార్, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని అభినందించారని తెలిపారు.

అవినాష్‌ను అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయులు సునన్దకుమార్, సిబ్బంది

సృజన వికాసం.. ప్రతిభకు పట్టం..

ఈనాడు ఆధ్వర్యంలో వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల, సింగరాయకొండలోని సెయింట్ జోన్స్ పాఠశాల, దర్శిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం ప్రతిభ పాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో కలిగే లాభ నష్టాలు- విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొని తమకు ఎదురైన అనుభవాలు, కలిగే నష్టాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వెలిగండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కాశీజ హర్షిని, జితేంద్ర, శాంతిలు ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి ఎంఈవో డి.రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బొగ్గారపు రామచంద్ర, ఉపాధ్యాయులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. సింగరాయకొండ సెయింట్ జోన్స్ పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులు సయ్యద్ నిహిత్, జాయ్ జెరీల్, షేక్ సుమయ్యాలకు కరెస్పాండెంట్ లక్ష్మణ్, ప్రిన్సిపల్ తాజుద్దీన్‌లు బహుమతులు అందజేశారు. దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజేతలైన కొదమల అభిషేక్‌కుమార్, మేకల చందు, టంగుటూరి వెంకటసాయిలకు ప్రధానోపాధ్యాయులు కాలేషావలి, ఉపాధ్యాయులు అవనీంద్ర, వాసు నాయక్, రంగారావు, నారాయణ బహుమతులు అందజేశారు. –న్యూస్‌టుడే, కనిగిరి, సింగరాయకొండ గ్రామీణం, దర్శి

కనిగిరి: విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంఈవో డి.రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు బి.రామచంద్ర, ఉపాధ్యాయులు

సింగరాయకొండ: బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు, చిత్రంలో పాఠశాల కరెస్పాండెంట్ లక్ష్మణ్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

దర్శి: విజేతలతో ప్రధానోపాధ్యాయులు కాలేషావలి, ఉపాధ్యాయులు

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్సై మాధవరావు పోలీస్ అమరవీరుల త్యాగాలను విద్యార్థినులకు వివరించారు. అనంతరం పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ముందుగా అమరవీరులకు నివాళులర్పించారు.

పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు.. చిత్రంలో పోలీసులు

ఈ చిత్రంలో కనిగిరి మండలం గద్దమీద పల్లెలోని మంచినీటి పథకమిది. దీనిని శుభ్రం చేసి ఏడాదికి పైగా అయిందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం పథకం చుట్టూ పాచిపట్టి నీరంతా కలుషితమైంది. కానీ ప్రజలు మాత్రం ఈ ట్యాంకు నుంచి కుళాయిలకు సరఫరా అయ్యే నీటిని తాగుతూ అనారోగ్యం పాలవుతున్నారు.

మండల కేంద్రమైన వెలిగండ్లలోని ఈ ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేసి ఏళ్లు గడుస్తోంది. కానీ రోజూ ఈ మంచినీటి పథకం ద్వారా సరఫరా అయ్యే నీటినే ప్రజలు తాగుతూ అవసరాలు తీర్చుకుంటున్నారు. పైగా ఈ ట్యాంకు శిథిలావస్థకు చేరి నీరంతా లీకేజీ అవుతుందని స్థానికులు తెలిపినా అధికార్లు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు.

మండలం - కనిగిరి
గృహాలు - 10,634
జనాభా - 47,711
ఓవర్ హెడ్ ట్యాంకులు - 30
చిన్న ట్యాంకులు - 14
బోర్లు 805

కనిగిరి మండలంలోని ప్రజలకు శుద్ధ జలం అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. నీటిశుద్ధికి ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా సరైన తాగునీరు అందక జనాలు రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఓవర్‌హెడ్ ట్యాంకులు, రక్షిత మంచినీటి పథకాల వద్ద అపరిశుభ్రత నెలకొంది. వాటిని నెల తరబడి శుభ్రం చేసిన దాఖలాలు లేవు. ఫలితంగా అవి పాచి పట్టి, వ్యర్థాలతో నిండి దర్శనమిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి అన్ని పంచాయతీల్లో నెలకొంది.

కమ్మవారిపల్లి సమీపంలో ఇలా..

కలుషిత జలం.. రోగాలతో జనం..

● మండలంలో కనిపించని ట్యాంకుల శుభ్రత ● పట్టించుకోని అధికారులు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి మండలంలో 25 పంచాయతీలు ఉండగా.. సుమారు 44 మంచినీటి పథకాలు, 805 బోర్లు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో వీటిని సంవత్సరాల తరబడి శుభ్రం చేయక పోవడంతో పాచి పట్టి అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. ఓ పక్క అధికారులు ప్రతి సమావేశంలో వర్షాలు పడుతున్నాయి.. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని.. ఎక్కడికక్కడే మంచినీటి పథకాలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు పరిశుభ్రం చేయాలని అంటూ దిశానిర్దేశం చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. అసలు ట్యాంకులు ఎప్పుడు శుభ్రం చేస్తారో తెలియని పరిస్థితి.

ప్రధానంగా మండలంలోని దిరిశవంచ, గురవాజీపేట, అద్దరోడ్డు, కమ్మవారిపల్లి, నందనమారెళ్ల, చల్లగిరిగల, దాసరిపల్లి, ఎన్ గొల్లపల్లి, మాచవరం, కంచర్లవారిపల్లి, గాయం వారిపల్లి, గద్దమీద పల్లి తదితర ప్రాంతాల్లో ట్యాంకులు శుభ్రం చేసిన దాఖలాలు లేవు. నీరు ఇలా నిల్వ ఉంటే అతిసారం, కలరా వంటి వ్యాధులకు ఊతం ఇచ్చినట్లే అవుతుందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వెలిగండ్లలో కూడా ఇదే పరిస్థితి..

వెలిగండ్ల మండలంలో మొత్తం 21 పంచాయతీలుండగా ఇక్కడ కూడా చిన్నా చితగా మంచినీటి పథకాలు 70 వరకు ఉన్నాయి. ఇక్కడ ఏ గ్రామంలో కూడా మంచినీటి పథకాలు శుభ్రపరిచిన దాఖలాలు లేవు. ప్రధానంగా మండల కేంద్రమైన వెలిగండ్లలో ఓవర్ హెడ్ ట్యాంకు అయితే మరింత శిథిలావస్థకు చేరి భయంకరంగా ఉంది. అయితే ఈ నీటినే మండల కేంద్రానికి అధికారులు సరఫరా చేస్తుండటం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మంచినీటి పథకాలకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో అన్నమ్మను స్పందిస్తూ మండల కేంద్రంలోని ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరిందని.. ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు.

'తప్పు చేసిన అధికారులను వదిలి పెట్టం'

వెలిగండ్ల, సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో తప్పు చేసిన అధికారులను వదిలిపెట్టమని.. ఎక్కడున్నా వారిని శిక్షిస్తామని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రాలు అందజేశారు. ప్రధానంగా వెలిగండ్ల, గన్నవరం, గుమ్మళ్లకర్ర, రంగన్నపల్లి తదితర గ్రామాల్లో పశువుల బీడు భూములు, అసైన్డ్ భూములను అప్పటి అధికారులు వైకాపా నేతలతో అంటకాగి ఇష్టానుసారంగా కట్టబెట్టారని.. కనీసం తమ పశువులను మేపు కొనేందుకు వీలులేకుండా చేశారని ఆయా గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. మరపగుంట్ల రోడ్డు కిరువైపులా రోడ్డును కొందరు ఆక్రమించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో కొందరు అధికారులు వెలిగండ్ల మండలంలోని ప్రభుత్వ భూములను వైకాపా నేతలకు ధారాదత్తం చేశారని.. అలాంటి అవినీతి అధికారులను ఎవరిని వదిలి పెట్టమన్నారు. దొంగ పట్టాలను రద్దు చేసి భూములను స్వాధీనం చేసుకుంటామని.. వాటిని దళితులు, వెనుకబడిన తరగతులకు, భూమిల్లేని నిరుపేదలకు పంపిణీ చేస్తామన్నారు. మొత్తం 156 అర్జీలు రాగా అందులో అధికంగా రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. కార్యక్రమంలో డీఎల్‌డీవో శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మి, ఎంపీడీవో అన్నమ్మ, తహసీల్దారు సుకన్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ● సీఎస్‌పురంలోని మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహా రెడ్డిని పాల్గొన్నారు. మొత్తం 194 అర్జీలు రాగా అత్యధికంగా 106 వినతులు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ ఖాదర్‌బీ, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వెలిగండ్ల: అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్ర

వైద్యశాలకు విరాళం అందజేత

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి సామాజిక వైద్యశాల అభివృద్ధికి వెలిగండ్ల మండలం కంకణంపాడుకు చెందిన పారిశ్రామిక వేత్త చిలకల కృష్ణారెడ్డి రూ.1 లక్ష విరాళాన్ని బుధవారం రాత్రి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నివాసంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. వైద్యశాల అభివృద్ధికి, పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు తనవంతు సాయం అందిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్రకు చెక్కును అందజేస్తున్న దాత కృష్ణారెడ్డి

కమ్మవారి పల్లెలో నీటికి కటకట

కనిగిరి: మండలంలోని కమ్మవారిపల్లిలో సాగర్ నీరు సరఫరా ఇబ్బంది పడుతన్నామని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వారు మాట్లాడుతూ.. గ్రామంలో బోర్లలో దొరికే నీళ్లలో 11శాతం పీపీఎం ఫ్లోరైడ్ ఉండటంతో మంచినీటి పథకానికి సరఫరా నీటిమీదనే ఆధారపడాల్సి వస్తుందన్నారు. గ్రామంలో రెండు ట్యాంకులు ఉంటే అందులో నుంచి నీరు రావడం లేదని.. అధికారులకు సమస్య చెప్పినా వారు పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్పందించి నీటిని సరఫరా చేయాలని కోరారు.

మండల కేంద్రం.. రోడ్లు ఛిద్రం

చిన్న వర్షం పడినా మండలకేంద్రం హనుమంతునిపాడు మురికి కూపంగా మారుతుంది. కనీసం అడుగుతీసి అడుగేయలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. గతంలో సిమెంట్ రోడ్లు వేసి కాలువలు తీశారు. గుత్తేదారులకు బిల్లుల చెల్లింపు చేయకపోవడంతో కాలువలపై మూతలు వేయలేదు. రామాలయం వద్ద, కొత్త, పాత బస్‌స్టాండ్‌లలో కనిగిరి - కంభం రహదారిలోని వాటర్ ప్లాంట్ వద్ద భారీగా గుంతల్లో నీరు చేరడంతో ద్విచక్రవాహనాలు జారి పడుతున్నాయి. బస్‌స్టాండ్ సెంటర్‌లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో రహదారి పూర్తిగా ఛిద్రమైంది. మూడువేల మంది జనాభా ఉన్న గ్రామంలో నిత్యం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. –న్యూస్‌టుడే, హనుమంతునిపాడు

హెచ్‌ఎంపాడు బస్‌స్టాండ్ వద్ద రోడ్డు దుస్థితి

సమస్యలు పరిష్కరించాలంటూ కార్మికుల ధర్నా

కనిగిరి: పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు కేశవరావు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 15 రోజుల సమ్మె కాలానికి వేతనాలు చెల్లించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కనిగిరి మున్సిపాలిటీలో 60 వేల మంది జనాభా ఉంటే కేవలం 68 మంది కార్మికులు మాత్రమే పనిచేస్తున్నారని.. అదనంగా కార్మికులకు తీసుకుని పని ఒత్తిడి లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే మార్కాపురంలో అక్రమంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. యూనియన్ నాయకులు ఓబయ్య, లక్ష్మయ్య, ఆనంద్, రవి, పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు

సంక్షిప్త సమాచారం

రోగులకు పండ్ల పంపిణీ

దర్శి, న్యూస్‌టుడే: దర్శికి చెందిన జనసేన నాయకులు షేక్ ఇర్షాద్ జయంతి సందర్భంగా బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నాయకులు వరికూటి నాగరాజు ఆధ్వర్యంలో నాయకులు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. స్థానిక కురిచేడు రోడ్డులోని ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

పంటల పరిశీలన

కురిచేడు, న్యూస్‌టుడే: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆవులమంద, పడమర వీరాయపాలెం రైతు సేవాకేంద్రం పరిధిలోని ఎం.గంగవరం గ్రామంలో వరి, మొక్కజొన్న పంటలను దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు బాలాజీ నాయక్ బుధవారం పరిశీలించారు.

కుక్కల నియంత్రణకు వినతి

పామూరు, న్యూస్‌టుడే: పామూరులో కుక్కల బెడత తీవ్రంగా ఉందని వీటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని తెదేపా నాయకులు పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందకు బుధవారం వినతిపత్రం అందజేశారు. కుక్కల వల్ల పిల్లలు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

పచ్చదనంతో ఆహ్లాదకరం

సి.ఎస్.పురం, న్యూస్‌టుడే: పచ్చనదంతో ఆహ్లాదకరంగా ఉంటుందని అంబవరం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. హనుమంతరావు అన్నారు. అంబవరం గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి, బెంగళూరు ఏజీ శాఖ విశ్రాంత సహాయ పర్యవేక్షకులు వేంపల్లి నారాయణరాజు, సుబ్బమ్మ దంపతులు రూ.10 వేలు విలువైన 30 టెంపుల్ మేరీ మొక్కలను తెప్పించి బుధవారం ప్రాంగణంలో నాటారు.

బస్సు సర్వీస్ ఏర్పాటుపై ఆరా

మర్రిపూడి: ఒంగోలు నుంచి మర్రిపూడికి బస్సు సర్వీసును ఏర్పాటు చేసేందుకు ఒంగోలు ఆర్టీసీ డీపో అధికారి బాలకోటయ్య బుధవారం పరిశీలించారు. ఒంగోలు నుంచి చిలంకూరు, చిమట, శివరాయునిపేట, వల్లాయిపాలెం మీదగా మర్రిపూడికి ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని ఆయా గ్రామాల ప్రజలు ఇటీవల మంత్రి డోలాకు వినతి పత్రాన్ని అందజేశారు.

టంగుటూరు: ఎం.నిడమానూరులో రెవెన్యూ అధికారులకు అర్జీలను అందజేస్తున్న గ్రామస్థులు

భూ సమస్యల పరిష్కారానికి గ్రామసభలు

టంగుటూరు, పొన్నలూరు, హెచ్‌ఎంపాడు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తుందని.. తహసీల్దారు ఆంజనేయులు తెలిపారు. మండలంలోని ఎం.నిడమానూరులో బుధవారం భూ రీసర్వేలో తలెత్తిన తప్పులు, సమస్యలపై నిర్వహించిన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ● పొన్నలూరు మండలం వెల్లటూరులో తహసీల్దారు పుల్లారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో 27 అర్జీలు వచ్చాయి. ● హనుమంతునిపాడు మండలం నీలకంఠాపురంలో తహసీల్దారు దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సభలో 47 అర్జీలు అందాయి.

పొగాకు రైతులు విధిగా మొక్కలు నాటాలి

టంగుటూరు: పొగాకు లైసెన్స్ కలిగిన రైతులు విధిగా మొక్కలు నాటాలని టంగుటూరు పొగాకు బోర్డు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఆలకూరపాడు గ్రామంలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు బ్యారెన్లలో క్యూరింగ్‌కు ప్రతీ రైతు 30 నుంచి 40 టన్నుల కలపను ఇంధనముగా వాడుతున్నందున పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని.. దీనిని నివారించేందుకు పొగాకు బోర్డు రైతులు కలప జాతి మొక్కలను నాటి పర్యావరణాన్ని సంరక్షించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే మొక్కలు నాటించారు. పొగాకు ఆలం రామారావు, వలేటి రామిరెడ్డి, వాకా కృష్టారెడ్డి, బోర్డు క్షేత్ర సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు మొక్కలు అందిస్తున్న పొగాకు బోర్డు అధికారులు

ఉద్యోగ విరమణ సత్కారం

కనిగిరి, న్యూస్‌టుడే: పదవీ విరమణ ఉద్యోగి జీవితంలో ఒక భాగమని.. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక జడ్పీబాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం హిందీ ఉపాధ్యాయురాలు మల్లెల నాగ భూషణం ఉద్యోగ విరమణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందన్నారు. ఎంతోమంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఒక్క ఉపాధ్యాయుడికి మాత్రమే సాధ్యమన్నారు. అనంతరం ఆమెను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు దిల్షాద్ బేగం, కళావతి, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

హిందీ ఉపాధ్యాయురాలు నాగభూషణంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆటో చోదకుడికి జైలు

కనిగిరి: మద్యం తాగి ఆటో నడిపిన ఆటో చోదకుడికి కనిగిరి కోర్టు రెండో తరగతి మేజిస్ట్రేట్ బుధవారం మూడు రోజులు జైలు శిక్ష, రూ. 3800 జరిమానా విధించినట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. బాలకేశవులు అనే ఆటో డ్రైవర్ మద్యం తాగి ఆటోను నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలో పట్టుబడ్డారు. అతణ్ని పోలీసులు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి శిక్ష విధించారు.

నలుగురు రౌడీ షీటర్లపై బైండోవర్

హనుమంతునిపాడు: గ్రామాల్లో రౌడీషీటర్లు గొడవలు సృష్టిస్తే కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై మాధవరావు పేర్కొన్నారు. మండలంలోని నలుగురు రౌడీషీటర్‌లపై బుధవారం బైండవర్ కేసులు నమోదుచేసి తహసీల్దారు దిలీప్ కుమార్ ముందు హాజరుపరిచారు.

ఉద్యోగినితో అసభ్యకర ప్రవర్తన

కనిగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో విధులు నిర్వహించే ఓ ప్రభుత్వ ఉద్యోగిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తాగుబోతును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పట్టణంలోని పామూరు బస్టాండ్‌లో దుకాణంలో పని చేస్తున్న ఓ యువకుడు మద్యం మత్తులో జోగుతూ.. కార్యాలయానికి వస్తున్న ఉద్యోగినిని అడ్డగించి నానా రభస చేశారు. దీంతో ఆ మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఆ యువకుడిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

వాహనాల తనిఖీ

కనిగిరి: పట్టణ పరిధిలో బుధవారం ఆర్టీసీ డీఎం సయనా బేగం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. సరైన ధ్రువ ప్రతాలు లేని వాహనాలను గుర్తించి రూ. 15,900లు జరిమానా విధించారు.

బాణసంచా స్వాధీనం

కురిచేడు: అనుమతులు లేకుండా నిల్వ చేసిన రూ.2.70 లక్షల విలువ చేసే బాణ సంచాను స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం రాత్రి ఎస్సై శివ తెలిపారు. కురిచేడు గ్రామానికి చెందిన క్రిష్ణారెడ్డి స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాల సమీపంలోని ఓ ఇంటిలో అధిక మొత్తంలో బాణాసంచా నిల్వ చేశారని సమాచారం అందటంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ క్రమంలో అధిక మొత్తంలో ఉన్న బాణ సంచాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఉపాధి నిధులు.. ప్రగతికి మెట్లు..

టంగుటూరు, న్యూస్‌టుడే:

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో గ్రామాలకు మహర్దశ పట్టనుంది. గత వైకాపా ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఒక్క పైసా నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసింది. కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన నిధులను విద్యుత్తు ఇతర బకాయిల పెండింగ్ కింద జమ చేసుకొని వాడుకుంది. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు కరవై అయిదేళ్ల సమస్యల వలయంలో అవి కొట్టుమిట్టడాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరు చేసింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కొండపి నియోజకవర్గానికి నిధులు కేటాయించింది. ప్రస్తుతం అభివృద్ధి పనులకు కూటమి నేతలు శ్రీకారం చుట్టారు.

కొండపికి రూ.17.16 కోట్లు విడుదల

గత అయిదేళ్ల వైకాపా పాలనలో గ్రామీణ ప్రాంతాలు కనీస వసతులకు దూరమయ్యాయి. నడిచేందుకు రోడ్లు లేక దయనీయ స్థితిలో గ్రామాలు ఉండిపోయాయి. ఉపాధి హామీ కింద ప్రజల వెతలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వం నడుం బిగించింది.

మండలం	విడుదలైన నిధులు (కోట్లలో)	పనులు	ఎంపికైన గ్రామాలు
కొండపి	2.94	16	09
టంగుటూరు	2.75	13	08
జరుగుమల్లి	3.15	17	13
సింగరాయకొండ	3.07	15	10
పొన్నలూరు	2.45	15	11
మర్రిపూడి	2.80	14	08
	17.16	90	59

టంగుటూరు– కొండపి రోడ్డులో పక్కా కాలువల నిర్మాణ పనులు చేపట్టిన దృశ్యం

కొండపి మండలం పెట్లూరులో సీసీ రోడ్ల పనులకు ఇటీవలె శంకుస్థాపన చేసిన మంత్రి బాలవీరాంజనేయస్వామి, అధికారులు

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చొరవ చూపి ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత నియోజకవర్గం కొండపికి రూ. 17.16 కోట్ల నిధులకు మంజూరు చేయించారు. నియోజకవర్గంలో సుమారు 110 పంచాయతీలు, వీటి పరిధిలో 150 వరకు గ్రామాలు ఉన్నాయి. ఒక్కో మండలానికి రూ. 2.75 కోట్ల నుంచి అత్యధికంగా రూ. 3.7 కోట్ల వరకు నిధులు కేటాయించారు. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను నిర్వహించనున్నారు. మొదటి విడతలో భాగంగా 90 పనులకు 21 కిలో మీటర్లు సీసీ రోడ్లు, 14 కి.మీ పక్కా కాలువలు నిర్మించనున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో మంత్రి స్వామి, కూటమి నేతలు శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించారు.

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

త్రైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ


షామిలి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూ-కే అంతర కళాశాలల త్రైక్వాండో పోటీల్లో రైజ్ కృష్ణసాయి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ కళాశాల వేదికగా ఈ నెల 22న పోటీలు నిర్వహించారు. 46 కిలోల విభాగంలో ఈసీఈ విద్యార్థిని కె.షామిలి... ప్రథమ; 80 కిలోల విభాగంలో రైజ్ ప్రకాశం ఈసీఈ విద్యార్థి బి.సాయివెంకటమౌనిష్ తృతీయ బహుమతులు సాధించారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ భాస్కరరావు, గౌరవ ఛైర్మన్ ఇస్కాల రంగమన్నార్, శిద్దా ప్రవళ్లిక, ప్రిన్సిపల్ కేవీ సుబ్రహ్మణ్యం, ఫిజికల్ డైరెక్టర్లు హిమచంద్రబాబు, సుబ్బారావు... వారిని అభినందించారు.

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత


ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నిర్వహణ పనుల కారణంగా ఒంగోలు నగర పరిధిలోని లాయర్‌పేట సాయిబాబా మందిరం, గాయత్రీ ఆలయం, బెతూన్ నర్సింగ్ హోం, ఉమామహేశ్వర జూనియర్ కళాశాల, మంగమూరు రోడ్డు పరిసర ప్రాంతాలకు... గురువారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ పాండురంగారావు తెలిపారు.

నగరేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు

చీమకుర్తి, న్యూస్‌టుడే: స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని చీమకుర్తి హరిహర క్షేత్రంలోని నగరేశ్వరునికి బుధవారం విశేష అభిషేకాలు నిర్వహించారు. సుమారు యాభై మంది భక్తులు అయ్యప్ప మాలలు ధరించారు.

ఉన్నది లేనట్లు... అంతా కనికట్టు!


అధికంగా నమోదుతో అవస్థలు...



మాకు 4.65 ఎకరాల భూమి ఉంది. రీసర్వే అనంతరం 11.11 ఎకరాలు ఉన్నట్లుగా నమోదు చేశారు. దీంతో రాయితీ స్ప్రింక్లర్ల కోసం దరఖాస్తు చేస్తే... అయిదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నందున ఇవ్వమని చెప్పారు. పంట రుణం కోసం బ్యాంకుకు వెళ్లినా ఇదే సమస్య తలెత్తింది. రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగితే... ఈ రెండు సమస్యల వరకు పరిష్కారం లభించింది. ఆన్‌లైన్లో మాత్రం ఇంకా 11.11 ఎకరాలే చూపుతోంది.

– గోగినేని వెంకటసుబ్బారెడ్డి, పి.గుడిపాడు

ఇళ్లను ప్రభుత్వ స్థలంగా చూపారు...



నేను, నా మిత్రుడు గంటా రాంబాబు కలిసి... 2004లో సర్వే నెంబరు 74, 74-2లో ఇంటి స్థలం కొనుగోలు చేసి గృహాలు నిర్మించుకున్నాం. గత ఇరవై ఏళ్లుగా అక్కడే ఉంటున్నాం. రీసర్వే అనంతరం... ఆ స్థలం ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు.

– నేలటూరి సత్యనారాయణ, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు

పంపకాలకు అవకాశం లేకుండా చేశారు...



మా అమ్మ పేరిట సర్వే నెంబరు 446, 104, 106, 108లో 2.40 ఎకరాల భూమి ఉంది. రీసర్వే తరువాత మా బాబాయి స్థలంతో కలిపి జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్సిల్ మ్యాప్) ఇచ్చారు. ఇటీవల మా తల్లి చనిపోయారు. ఇప్పుడు ఆ పొలాన్ని... వారసులమైన మా ముగ్గురు అన్నదమ్ముల పేరిట ఆన్‌లైన్ చేసుకునేందుకు జాయింట్ ఎల్‌పీఎం అడ్డంకిగా మారింది. సమస్య పరిష్కరించాలని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రయోజనం లేకపోతోంది.

– కడియాల ప్రసాదరావు, మద్దిపాడు

న్యూస్‌టుడే – సంతనూతలపాడు, మద్దిపాడు

ఉన్న భూమి లేనట్లు... లేనిది ఉన్నట్లు చూపారు. ఒకరిది మరొకరి పేరిట మార్చేశారు. పట్టా స్థలాలను ప్రభుత్వ జాగాలుగా పేర్కొన్నారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో ఇలాంటి చిత్రవిచిత్రాలెన్నో చోటుచేసుకున్నాయి. తప్పులతడకగా చేపట్టిన నాటి ప్రక్రియ... నేడు రైతులకు మరిన్ని చిక్కులు తెచ్చిపెట్టింది. ఈ తప్పిదాలు సరిచేసి కర్షకుల కష్టాలు తీర్చేందుకు గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామ సభలకు అర్జీలు వెల్లువలా వస్తున్నాయి.

అడంగల్ రాదు... అవస్థలు తీరవు

భూముల రీసర్వే చేపట్టే గ్రామాల్లో ముందుగానే రైతులకు సమాచారం ఇవ్వాలి. వారి సమక్షంలోనే ప్రక్రియ చేపట్టాలి. ప్రాథమికంగా సర్వే పూర్తి చేశాక... వివరాలు తెలిజేసి అభ్యంతరాలుంటే పరిష్కరించాలి. ఇవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారం రీసర్వే నిర్వహించడంతో కుప్పలు తెప్పలుగా తప్పులుదొర్లాయి. తరువాత వాటిని సరిచేసుకునేందుకు రైతులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేకపోయింది. ముఖ్యంగా ఒక సర్వే నంబరులో ఎందరు రైతులకు భూములున్నా... ఆ విభజన చూపకుండా జాయింట్ ఎల్‌పీఎం కేటాయించారు. దీంతో వ్యక్తిగత అడంగల్, 1బీ కాపీలు రాక... ఇటు రాయితీ పథకాలు, అటు పంట రుణాలు అందడం లేదు. కొన్ని చోట్ల రెవెన్యూ అధికారుల ప్రమేయంతో వీటి వరకు ఇబ్బంది లేకుండా చేశారు. ఆన్‌లైన్లో వివరాలు మాత్రం మారడం లేదు. దీంతో క్రయ విక్రయాలకు అవకాశం లేక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

- ● రీసర్వే తప్పులతో రైతులకు చిక్కులు
- ● గ్రామ సభలకు వెల్లువెత్తుతున్న అర్జీలు


మద్దిపాడు గ్రామ సభలో అర్జీలు అందజేస్తున్న రీసర్వే బాధితులు

45 రోజుల్లో పరిష్కరించేలా...

ఈ తప్పిదాలు సరిచేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ నెల 22 నుంచి... రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ఆయా మండలాల తహసీల్దార్ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సభలు నిర్వహిస్తోంది. వీటికి బాధితులు పోటెత్తుతున్నారు. మద్దిపాడులో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి ఏకంగా 70 అభ్యంతరాలు రావడం గమనార్హం. చీమకుర్తి మండలంలోని మూడు గ్రామాల నుంచి 92 వినతులు; సంతనూతలపాడు మండలం పి.గుడిపాడులో 47 అర్జీలు అందాయి. అన్ని గ్రామాల్లో ప్రక్రియ పూర్తయితే ఈ సంఖ్య వందల్లో ఉంటుందని అంచనా వేస్తున్నారు. వీటిని పరిశీలించి... 45 రోజుల్లో పరిష్కించేలా కార్యాచరణ రూపొందించినట్లు అధికారులు తెలిపారు.

రెండు రోజుల్లోనే 231 అభ్యంతరాలు...

మండలం	రీసర్వే పూర్తయిన గ్రామాలు	రెండు రోజుల్లో వచ్చిన అభ్యంతరాలు
సంతనూతలపాడు	10	64
మద్దిపాడు	11	75
చీమకుర్తి	14	92

● నాగులుప్పలపాడు, కొత్తపట్నం, ఒంగోలు మండలాల్లో ఈ నెల 25 నుంచి రీసర్వే గ్రామసభలు ప్రారంభం కానున్నాయి.


అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుధాకర్

కొత్తపట్నంలో ఓపెన్ హౌస్

కొత్తపట్నం, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్తపట్నం స్టేషన్‌లో బుధవారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు... ఉపయోగించే తుపాకీ, లాఠీ, పలు రకాల దస్త్రాల నిర్వహణ, విధులు, లాకప్, సెట్ కాన్ఫరెన్స్ తదితరాలపై ఎస్సై వి.సుధాకర్, సిబ్బంది అవగాహన కల్పించారు.

శివారులో వసతుల కల్పించండి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నగర శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పనకు చర్యలు తీసుకోవాలని సీపీఐ నగర సమితి సభ్యులు కమిషనర్ కె.వెంకటేశ్వరరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గ్రావెల్ రోడ్లు, కాలువల నిర్మాణం చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని... మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, ఎస్కే సర్దార్, కైలా అజయ్, టి.అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం రక్షణకు వినతి: చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి క్రిస్టియన్‌పాలేనికి చెందిన శ్మశాన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని కమిషనర్ వై.రామకృష్ణయ్యకు స్థానికులు బుధవారం వినతిపత్రం అందజేశారు. సుమారు ఆరెకరాల స్థలంలో కొంత భాగాన్ని ఆక్రమించారని తెలిపారు. సర్వే నిర్వహించి స్థలం రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.


పోటీలో పాల్గొన్న విద్యార్థులు


విజేతలతో ప్రిన్సిపల్ రమణారావు, ఉపాధ్యాయులు

వ్యాస రచన... భళా సృజన

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా బుధవారం... రామనగర్‌లోని భాష్యం హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్ వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం' అన్న అంశంపై తమ అభిప్రాయాలకు అక్షర రూపమిచ్చారు. విద్యార్థులు కె.చైతన్య కిషోర్ (9వ తరగతి)... ప్రథమ; కె.హర్షిత (8వ తరగతి)... ద్వితీయ, యు.అనూష (పదో తరగతి)... తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి ప్రిన్సిపల్ ఎం.వి.రమణారావు, జోనల్ ఇన్‌ఛార్జి శ్రీకృష్ణ గణేష్ చేతులమీదుగా బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతకం పెట్టి వెళ్లిపోయారు!

● ఇద్దరు సిబ్బందికి కమిషనర్ తాఖీదులు


పట్టణ ప్రణాళిక విభాగాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్

సంతకం పెట్టి వెళ్లిపోయేవారు కొందరైతే... మధ్యాహ్నం భోజనానికి వెళ్లి తిరిగిరానివారు మరికొందరు... ఇదీ నగరపాలక సంస్థ కార్యాలయంలో కొందరు ఉద్యోగుల పరిస్థితి. సీట్లలో కనిపించరు. ప్రజలకు అందుబాటులో ఉండరు. వేతనాలు మాత్రం ఒకటో తేదీనే ఠంచనుగా తీసుకుంటారు. సిబ్బంది తీరుపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు బుధవారం సాయంత్రం ఆకస్మికంగా పలు సెక్షన్లు తనిఖీ చేశారు. పట్టణ ప్రణాళిక విభాగంలో జీ-1 సీటు చూస్తున్న ఉద్యోగి, ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో మరో ఉద్యోగి అందుబాటులో లేకపోవడంతో ఆరా తీశారు. బయటకు వెళ్లి రాలేదని ఇతర సిబ్బంది చెప్పడంతో... ఆ ఇద్దరికీ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కమిషనర్ ఆదేశించారు. కార్యాలయవేళల్లో అందుబాటులో ఉండకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. – న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

బౌద్ధ దమ్మ దీక్ష జయప్రదానికి విజ్ఞప్తి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: వచ్చే నెల 24న ఒంగోలులో అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న బౌద్ధ దమ్మ దీక్ష ఉత్సవాన్ని జయప్రదం చేయాలని టీబీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు ఈ.మహేష్ విజ్ఞప్తి చేశారు. సంబంధిత కరపత్రాలను ఎంసీఏ భవన్‌లో బుధవారం ఆవిష్కరించారు. 1956 అక్టోబర్ 14న అశోక విజయ దశమి సందర్భంగా అంబేడ్కర్ బౌద్ధం స్వీకరించారన్నారు. ఆ స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీటీఏ ప్రతినిధి పి.వెంకటరావు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు నాగేంద్ర వదన్, సుధాకర్, సుధీర్, హరిప్రసాద్, అజయ్‌బాబు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు


కాలువలో దోమల నివారణ మందు వేస్తున్న ఎంపీడీవో జ్యోతి, సిబ్బంది

మద్దిపాడు, న్యూస్‌టుడే: వెల్లంపల్లి... నిర్వహించిన ఆధార్ శిబిరాన్ని ఎంపీడీవో జ్యోతి బుధవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పలు గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించారు. కాలానుగుణ వ్యాధులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ఏఎన్ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. ● వెల్లంపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మురుగు నిలవడంతో... కార్యదర్శి మాధవి ఆధ్వర్యంలో జేసీబీతో చదును చేయించారు. ● మద్దిపాడు, గార్లపాడు గ్రామాల్లో వైద్యాధికారి ఆనంద్‌మోహన్, సిబ్బంది ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. సర్పంచి గంగిరెడ్డి, సీహెచ్‌వో రజితకుమారి పాల్గొన్నారు.


ప్రదర్శనలో పాల్గొన్న ఆర్.ఎం. గున్నేశ్వరరావు, ఇతర అధికారులు

ఎస్‌బీఐ పథకాలపై ప్రచారం

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ పథకాలు, బ్యాంకు అందిస్తున్న రుణాల విషయమై ఎస్‌బీఐ ఆధ్వర్యంలో రంగారాయుడు చెరువుకట్టపై బుధవారం ప్రచారం నిర్వహించారు. అన్ని వివరాలతో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం ద్వారా అందజేస్తున్న రుణం, రాయితీలు తెలియజేశారు. ప్రాంతీయ మేనేజర్ గున్నేశ్వరరావు మాట్లాడుతూ... వరుస పండగల నేపథ్యంలో గృహ రుణాలపై వడ్డీ రేట్ల తగ్గింపు, ప్రాసెసింగ్ ఫీజులో రాయితీ ఇస్తున్నట్లు వివరించారు. ఏజీఎం వెంకటరావు, చీఫ్ మేనేజర్లు వి.రాజేష్, వీరయ్య, నాగేశ్వరరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

చీమకుర్తి, న్యూస్‌టుడే:

?: చీమకుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో విద్యుత్తు స్తంభానికి ఓ చెట్టు అల్లుకుపోవడంతో... గాలులు వీచే సమయంలో సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

– శ్రీనివాసరావు, స్థానికుడు

✓: వెంటనే సమస్యను పరిష్కరిస్తాం.– ఎం.శ్రీనివాసరావు. ఏఈ

వెలిగిన దీపాలు

స్పందనకు వందనం

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి పల్లపోతు వారి బజారుకు వెళ్లే మలుపులోని వీధి దీపానికి మున్సిపల్ సిబ్బంది బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఈ ప్రాంతంలో వీధి దీపాలు వెలగని విషయాన్ని 'ఈనాడు- మేమున్నాం... మీకు తోడుగా'లో ప్రచురించడంతో అధికారులు స్పందించి ఈ చర్యలు తీసుకున్నారు.

ఇళ్లలోకీ వెళ్లలేక... ఆరు నెలలుగా నరకం



నగరంలోని రెవెన్యూ కాలనీలో పరిస్థితి ఇది. సార్వత్రిక ఎన్నికలకు ముందు... రెవెన్యూ కాలనీ, శివాజీనగర్ మధ్య రోడ్డు, కాలువ నిర్మాణం చేపడతామని ఇరువైపులా ఉన్న నివాసాల మెట్లు తొలగించారు. ఆరు నెలలు కావస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో ఆ ప్రాంత నివాసితులు ఇళ్లలోకి వెళ్లేందుకు నానా అవస్థలు పడుతున్నారు. మహిళలు, వృద్ధుల ఇక్కట్లు వర్ణనాతీతం. అత్యవసరమైనా బయటకు రాలేని దుస్థితి. రాకపోకలకు వీలుగా ఇసుక బస్తాల వంటివి వేస్తున్నా... మురుగు ప్రవాహానికి అంతరాయం కలుగుతోందంటూ సిబ్బంది తొలగిస్తున్నారు. అలాగని ర్యాంపుల నిర్మాణం చేపడితే మళ్లీ ఎక్కడ తొలగిస్తారోనని ఆ పనులు చేపట్టలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. నిత్యం నరకం అనుభవిస్తున్నామని... నగర పాలక సంస్థ అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా... 'మార్కింగ్ విషయమై ఓ వ్యక్తి అభ్యంతరం తెలపడంతో సమస్య తలెత్తింది. పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి... సదరు వ్యక్తి స్థలంలోకి మార్కింగ్ వెళ్లలేదని తేల్చారు. మరోవైపు... పాత బిల్లులు చెల్లించలేదని గుత్తేదారు పనులు ఆపేశారు. నెల రోజుల్లో రహదారి నిర్మాణం మొదలయ్యేలా చర్యలు తీసుకుంటామ'ని తెలిపారు. – న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పదిహేనేళ్లకు పైగా విద్యుత్తు మీటర్ రీడర్లుగా విధులు నిర్వహిస్తున్న ఒప్పంద కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ... ఏఐటీయూసీ నగర సమితి ఆధ్వర్యంలో డీఈఈ కృష్ణకాంత్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో సుమారు 250 మంది ఇలా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా స్మార్ట్ మీటర్లు అమర్చనున్న నేపథ్యంలో వీరి ఉపాధి దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు. అర్హతల ఆధారంగా కంప్యూటర్ ఆపరేటర్లు, వాచ్‌మెన్, అటెండర్లు, డ్రైవర్లుగా నియమించాలని విన్నవించారు. ఏఐటీయూసీ నాయకులు శ్రీరామ్ శ్రీనివాసరావు, సిద్దయ్య, నాగార్జున్‌రెడ్డి, విజయ్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కీలక మార్గం... అవస్థలే నిత్యం

సంతనూతలపాడు - కొండపి మండలాలను కలుపుతూ చంద్రపాలెం, గంగవరం, పి.తక్కెళ్లపాడు, చిలకపాడు, మద్దులూరు, అనకర్లపూడి మీదుగా వెళ్లే రహదారి దుస్థితి ఇది. ఈ పరిధిలోని వారంతా జిల్లా కేంద్రం ఒంగోలు వెళ్లేందుకు ఇదే ఆధారం. నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. మొత్తం 19 కిలోమీటర్ల మేర విస్తరించిన మార్గంలో ఎక్కడికక్కడ భారీ గుంతలు ఏర్పడ్డా... గత అయిదేళ్లుగా కనీస మరమ్మతులు చేపట్టలేదు. ప్రస్తుత వర్షాలకు ఆయా గోతుల్లో నీరు చేరి పరిస్థితి మరింత దిగజారింది. ఒడ్డెరపాలెంలో రోడ్డుపైనే మురుగు పారుతోంది. మరికాస్త ముందుకు వెళ్తే... ఇరువైపులా అంచులు దెబ్బతిని కంకర తేలింది. చంద్రపాలెం ఎస్సీ కాలనీ సమీపంలోని మలుపు వద్ద భారీ గుంతలు ఏర్పడి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. మద్దులూరు - అనకర్లపూడి మధ్య ద్విచక్రవాహనదారులు సైతం రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. రాత్రి వేళ తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వేలాది మందికి ఉపయోగపడే రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, సంతనూతలపాడు


మద్దులూరు ఉన్నత పాఠశాల వద్ద పరిస్థితి


అనకర్లపూడి సమీపంలో ఇలా...

వైకాపా తప్పులు... నేటికీ తిప్పలు


కమ్మపాలెంలో ఆగిపోయిన రహదారి నిర్మాణం


మిగతా రోడ్డు తీరిది

నగరంలో రవాణా సదుపాయాల మెరుగు, ట్రాఫిక్ సమస్య పరిష్కారం దిశగా అప్పటి తెదేపా ప్రభుత్వం చర్యలు తీసుకున్నా... తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం వాటిని కొనసాగించక నేటికీ చిక్కులు తప్పడం లేదు. కమ్మపాలెం రహదారి ఇందుకు ఓ ఉదాహరణ. 2017-18 మధ్య రూ.1.55 కోట్లతో కొత్తపట్నం బస్టాండ్ కూడలి నుంచి దశరాజుపల్లి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణానికి అప్పటి తెదేపా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నాడు ఎమ్మెల్యేగా ఉన్న దామచర్ల జనార్దన్ చొరవ చూపడంతో... అప్పటి పురపాలకశాఖ మంత్రి నారాయణ ప్రత్యేక గ్రాంట్‌గా ఈ నిధులు మంజూరు చేశారు. రహదారి, డివైడర్లతో పాటు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు నిర్ణయించారు. ఓ వైపు రోడ్డు నిర్మాణం కూడా పూర్తయ్యింది. ప్రైవేటు స్థలాల విషయమై కొందరు అభ్యంతరం తెలిపారు. వారికి సర్ది చెప్పి మళ్లీ పనులు ప్రారంభించే సరికి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం ఈ పనులను కొనసాగించలేదు. స్థానికులు పలుమార్లు విన్నవించినా నగర పాలక సంస్థ పాలకవర్గం పట్టించుకోలేదు. ఈ రోడ్డులోంచి గోపాల్‌నగర్ మీదుగా తిరిగి బస్టాండ్‌కు చేరుకోవచ్చు. ట్రంక్‌రోడ్డులో ఏదైనా ట్రాఫిక్ సమస్యలు తలెత్తితే ప్రత్యామ్నాయంగా దీనిని వినియోగించుకోవచ్చు. ఈ ప్రాధాన్యం దృష్ట్యా పనుల పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కమ్మపాలెం (ఒంగోలు అంజయ్యరోడ్డు)

బోధన
డిజిటల్ కాంతులేనేనా!

❖ వైకాపా పాలనలో పడక
❖ దృష్టి సారిస్తే విద్యార్థులకు సాంత్వన



న్యూస్‌టుడే, టంగుటూరు :

ప్రభుత్వ బడుల్లో సాంకేతిక శిక్షణ అంటూ హడావుడి చేసిన గత పాలకులు ఆచరణలో చతికిలపడ్డారు. పాఠ్యాంశాలను విద్యార్థులకు పూస గుచ్చినట్లు అర్థమయ్యేలా చెబుతూ దృశ్యరూపంలో చూపుతూ బోధించే డిజిటల్ బోధన మున్నాళ్ల ముచ్చటగా మిగిలింది. దీనికోసం వెచ్చించిన కోట్ల రూపాయలు బూడిదలో పోసిన పన్నీరైంది. కొత్త ప్రభుత్వం దీన్ని గాడిలో పెట్టాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన కాస్తా గత పాలకుల ప్రణాళిక లేమితో నీరుగారింది. దీనికోసం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ (ఐఎఫ్‌పీ)ను అందించినా నిర్వహణ పట్టించుకోకపోవడంతో అదంతా అడవి గాచిన వెన్నెలైంది. గత ప్రభుత్వం 'ఫేజ్-1, 2'లో సుమారు 2,846 డిజిటల్ తెరలను జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సమకూర్చింది. వీటిని అమర్చే బాధ్యత ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించింది. మండల కేంద్రాలు, పట్టణాల్లో సదుపాయాలున్న పాఠశాలల్లో ఈ తెరలను కొంతమేర అమర్చారు.

అంతర్జాల సౌకర్యం కల్పిస్తే ..

వైకాపా పాలకులు మొక్కుబడిగా సాగించిన డిజిటల్ బోధనను కొత్త ప్రభుత్వం గాడిలో పెట్టాలని విద్యా నిపుణులు సూచిస్తున్నారు. స్కూళ్లలో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్) ఆండ్రాయిడ్ బాక్స్, సబ్జెక్ట్ కంటెంట్ మెమరీ చిప్ వంటివి అప్పట్లో అందించారు. ఆ చిప్‌లలో నాలుగో తరగతి నుంచి ఇంటర్ వరకు ఆయా తరగతుల వారీగా పాఠ్యాంశాల వివరాలుండేవి. వాటిని సరిపోల్చి విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయి. అదే సమయంలో డిజిటల్ బోధనకు అనుగుణంగా అంతర్జాల సౌకర్యం కల్పించాలి. ప్రతి పాఠశాలకు రూ. 5 వేల చొప్పున వెచ్చించడం వల్ల తెరను ఉపయోగంలోకి తీసుకురావచ్చు. వైరింగ్ చేసి ప్యానెల్స్ పనిచేసేలా చేస్తే ఫలితం ఉంటుందని వారంటున్నారు.

అట్టపెట్టెల్లోంచి తీయనే లేదు..


జమ్ములపాలెం పాఠశాలలో..

గ్రామీణ ప్రాంతాలు, సుదూర గ్రామాల్లోని పాఠశాలల్లో డిజిటల్ బోధన అలంకారప్రాయమైంది. అక్కడి పాఠశాలలకు అందించిన ప్యానల్స్‌ను అట్టపెట్టెల్లోంచి బయటకే తీయనే లేదు. పాఠ్యాంశాలు బోధించేందుకు మొదట్లో ఉపాధ్యాయులకు నామమాత్ర శిక్షణ ఇచ్చారు. ఇక కొన్నిచోట్ల విద్యుత్తు, అంతర్జాల సౌకర్యం లేకపోవడంతో ఇదంతా ఓ మొక్కుబడి వ్యవహారంగా సాగింది.

ఈ విధానంపై సమీక్షించాం

చాలా పాఠశాలల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురాలేదు. ఇప్పటికీ అట్టపెట్టెల్లోంచి తీయలేదు. దీనిపై ఉపాధ్యాయులకు సమాచారమిస్తున్నాం. ఇటీవల జరిగిన సమావేశాల్లో ఈ అంశంపై సమీక్షించాం. ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరలో గాడిలో పెడతాం. - **సుబ్బారావు, ఇన్‌ఛార్జి డీఈవో**

రైల్వే పనులకు ప్రతిపాదనలు పంపండి


రైల్వే క్రాసింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ర.భ. అధికారులు

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు రైల్వేక్రాసింగ్ 193, 194 వద్ద పనులు చేయాల్సిన సబ్‌వే, ఆర్వో వంతెన నిర్మాణానికి అంచనాలు వేసి, ప్రతిపాదనలు సత్వరం పంపాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా రహదారులు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. టంగుటూరులోని 193, 194 రైల్వే క్రాసింగ్‌లను ఆమె ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె వారితో మాట్లాడుతూ గ్రామంలోని ఈ క్రాసింగ్ వద్ద సబ్‌వే, ఆర్వో వంతెన నిర్మాణానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. టంగుటూరు గ్రామ ప్రజలతో పాటు సముద్ర తీర గ్రామాలైన ఆలకూరపాడు, అనంతవరం, వెలగపూడి తదితర గ్రామాలవారు రాకపోకల వేళ ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఎస్‌ఈ దేవానందం, ఈఈ గోపీ నాయక్, ఏఈ నాగార్జున, తహసీల్దార్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 4 నుంచి డీఈఐఈడీ పరీక్షలు

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రైవేటు కళాశాలల్లో చదివే డీఈఐఈడీ మొదటి సంవత్సరం విద్యార్థులకు నవంబర్ 4 నుంచి 9 వరకు సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని డైట్ ప్రిన్సిపల్ సామా సుబ్బారావు పేర్కొన్నారు. 2018-20 మేనేజ్‌మెంట్, ఆస్పెట్ మెరుగైన విద్యార్థులకు పరీక్ష జరుగుతుందన్నారు.

దర్శి అసెంబ్లీ కాంగ్రెస్ సమన్వయకర్తగా సుధాకరరెడ్డి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: దర్శి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ సమన్వయకర్తగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకరరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏపీసీసీ నుంచి సమన్వయకర్తల జాబితా విడుదల చేశారు. ఈ బాధ్యతలు అప్పగించడానికి సహకరించిన పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఏకేయూలో క్రీడా పోటీలు ప్రారంభం


ఫెన్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న ఉపకులపతి మూర్తి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: క్రీడాపోటీలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపకులపతి మూర్తి అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఫెన్సింగ్, తైక్వాండో పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 54 కిలోల తైక్వాండో పురుషుల విభాగంలో జి. భాస్కర్, 63 కిలోల విభాగంలో ఎం.రంజిత్, 57 కిలోల మహిళ విభాగంలో గిరిజారెడ్డి, 62 కిలోల విభాగంలో ఎం.శైలజ, ఫెన్సింగ్ పురుషుల విభాగంలో నవీన్‌కుమార్‌రెడ్డి, మహిళల విభాగంలో ఆర్. విజయలక్ష్మి విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డీడీ దేవీవరప్రసాద్, ప్రిన్సిపల్ రాజమోహన్, వైస్ ప్రిన్సిపల్ నిర్మలామణి, డీన్ సోమశేఖర పాల్గొన్నారు.


నూతన కార్యవర్గ సభ్యులు

నర్సుల సంఘం కార్యవర్గం ఎన్నిక

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ నర్సుల సంఘం నూతన కార్యవర్గాన్ని జీజీహెచ్‌లో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా మోపిదేవి ఉదయలక్ష్మి, ఉపాధ్యక్షులుగా కేతుమాల సుజాత, కార్యదర్శిగా కొత్తపల్లి మంజేష్, కోశాధికారిగా మండవ సుజాత, కార్యవర్గ సభ్యులుగా డి.నాగరాజకుమారి, బీవీ రామలక్ష్మి, మహేష్, జానీబాషా, ఎస్‌కే బహబూబి ఎన్నికయ్యారు.

ఉపాధి హామీ పనులపై శిక్షణ

సంతనూతపాడు, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు సక్రమంగా చేపట్టాలని ఏపీడీఓ వెంకటస్వామి పేర్కొన్నారు. చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల క్షేత్ర సహాయకులకు సంతనూతలపాడు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. జాబ్ చార్ట్ తయారీ, రోజువారీ కూలి వేసే విధానం, మస్తర్ల నమోదు, పని కొలతలు తదితరాలపై అవగాహన కల్పించారు. శిక్షకులు లలితకుమారి, చంద్రశేఖర్ పలు అంశాలు వివరించారు. ఏపీవోలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఒంగోలు నేర విభాగం, న్యూస్‌టుడే: బిలాల్‌నగర్ సమీపంలో బుధవారం... గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సుమారు యాభై ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి చిల్లకంపలో విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎవరన్నది గుర్తించేందుకు ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృతదేహాన్ని జీజీహెచ్ శవాగారానికి తరలించారు. సీఐ అజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి గాయాలు

మద్దిపాడు, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు శ్రీరామ్‌కాలనీకి చెందిన కొడాలి నాని... బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో మద్దిపాడు నుంచి ఒంగోలుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. వెంకటరాజుపాలెం సాయిబాబా ఆలయం సమీపంలో అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పోలీసులు ఆయనను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అనుమానితులు సంచరిస్తే తెలియజేయండి

చీమకుర్తి, న్యూస్‌టుడే: కోడిపందేలు, జూదం, గంజాయి విక్రయం, గ్రానైట్ అక్రమ రవాణా వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎం.సుబ్బారావు హెచ్చరించారు. దుకాణాలు, వాణిజ్య సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. బాణసంచా విక్రయ తాత్కాలిక లైసెన్సులు పొందిన వారు పండుగ తర్వాత మిగిలిన సామగ్రిని... లైసెన్సు ఉన్న గోదాముకు తిరిగి అప్పగించాలన్నారు.

విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని వినతి

నాగులుప్పలపాడు, న్యూస్‌టుడే: కనపర్తి పంచాయతీ దాసరివారిపాలెంలో దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఉప్పుగుండూరు ఉప కేంద్రం అధికారులకు బుధవారం వినతిపత్రం అందజేశారు. 1978లో ఏర్పాటు చేసిన లైన్ దెబ్బతినడంతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పలు స్తంభాలు సైతం శిథిలావస్థకు చేరాయని, తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయని వివరించారు. సీపీఎం మండల కార్యదర్శి శ్రీకాంత్, గ్రామస్థులు రామాంజనేయులు, ఏసు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

రైళ్లలో నిఘా పెంచండి: రాహుల్ మీనా

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రైళ్లలో నిఘా పెంచి.. నేరగాళ్ల కదలికలపై సమాచారం ఉండాలని గుంతకల్ రైల్వే ఎస్పీ రాహుల్ మీనా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని రైల్వే సీఐ కార్యాలయంలో రైల్వే సబ్ డివిజన్ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. దొంగతనాలు, దోపిడీ కేసుల్లో దర్యాప్తుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకు రైళ్లలో గస్తీ పెంచాలన్నారు. నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. దోపిడీ, దొంగతనాల కేసుల్లో దర్యాప్తును త్వరితగతిన పూర్తిచేసి చోరీ సొత్తు రికవరీ చేయాలన్నారు. అనంతరం నెల్లూరు రైల్వే పోలీసుస్టేషన్‌ను పరిశీలించారు. సమావేశంలో నెల్లూరు, ఒంగోలు రైల్వే సీఐలు భుజంగరావు, షరీఫ్, సూళ్లూరుపేట, నెల్లూరు, ఒంగోలు, చీరాల ఎస్సైలు చెన్నకేశవరావు, మాలకొండయ్య, అరుణకుమారి, కొండయ్య పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు!



మంగమూరురోడ్డు, సమతానగర్ రోడ్డులో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వెంటపడి తరుముతుండడంతో అటుగా వెళ్లేందుకు పాదచారులు, వాహనదారులు భయపడుతున్నారు. వాటి కారణంగా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోయిన సందర్భాలు ఉన్నాయి. తమ ప్రాంతంలో ఓ ఇరవై వరకు కుక్కలు ఉన్నాయని... వాటి అరుపుల కారణంగా రాత్రివేళ నిద్ర ఉండడం లేదని ప్రగతినగర్‌లోని శ్రీనివాస టవర్స్ నివాసితులు వాపోతున్నారు. నగరంలో శునకాల సమస్య పరిష్కరించేందుకు... వాటికి సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయిస్తామని కార్పొరేషన్ అధికారులు ప్రకటించినా ఇంతవరకు ఆ ప్రక్రియ ప్రారంభించలేదు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

కూలిపోయేలా ఉంది... కాస్త చూడరూ!



నిత్యం రద్దీగా ఉండే ఒంగోలు ట్రంక్ రోడ్డులో... అల్లూరయ్య స్వీట్స్ దుకాణం ఎదురుగా ఉన్న విద్యుత్తు స్తంభం దుస్థితి ఇది. అడుగుభాగం పూర్తిగా దెబ్బతిని... కొద్దిపాటి అతుకుతో నిలిచి ఉంది. దీనికే పదుల సంఖ్యలో సర్వీసు, కేబుల్ వైర్లు ఉన్నాయి. ప్రస్తుతం వరుసవారీగా అల్పపీడనాలు తలెత్తుతున్న నేపథ్యంలో... ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని స్థానిక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

సెపక్‌తక్రాలో సత్తా చాటిన ప్రకాశం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు విజేతలుగా నిలిచారు. జిల్లా సెపక్‌తక్రా సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ నగరపాలకోన్నత పాఠశాల మైదానంలో మంగళవారం ప్రారంభమైన 34వ రాష్ట్ర స్థాయి సీనియర్ సెపక్‌తక్రా ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. మహిళల విభాగంలో శ్రీకాకుళం జట్టు ప్రథమ, పశ్చిమగోదావరి ద్వితీయ, కర్నూలు, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం దక్కించుకున్నాయి. పురుషుల విభాగంలో కర్నూలు జట్టు ప్రథమ స్థానం, డా. బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జట్టు ద్వితీయ, శ్రీకాకుళం, ప్రకాశం జట్లు సంయుక్తంగా తృతీయ స్థానం సొంతం చేసుకున్నాయి. విజేతలకు మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, పురపాలక మాజీ అధ్యక్షురాలు ఎంవీ పద్మావతి, సెపక్‌తక్రా జిల్లా ఛైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.స్వరూప్, జి.అర్జున్‌రావు రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 540 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.95/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 130, రిటైల్ లైవ్ - 152, చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్- 251

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల వాయిదాకు వినతి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: నవంబర్ 5వ తేదీ నుంచి జరగాల్సిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డీవీఆర్.మూర్తికి బుధవారం వినతిపత్రం అందజేశారు. గత నెల రోజులుగా వర్షాలు పడి విద్యాసంస్థలు ఎక్కువ రోజులు పనిచేయకపోవడంతో సిలబస్ పూర్తి కాలేదని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ వీసీ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీహెచ్.శ్యామ్, బాలాజీ, సతీష్, కోటి పాల్గొన్నారు.

ప్రభుత్వ సానుకూల స్పందనతో ధర్నా వాయిదా

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించినందున యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ డైరెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా వాయిదా వేసినట్లు యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి చింతలపాటి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. టీచర్ల ఉద్యోగోన్నతులు, ఇతర డిమాండ్లపై పాఠశాల విద్యా కమిషనర్‌తో జరిపిన చర్చలు ఫలించాయన్నారు. ఉన్న ఖాళీల్లో వెంటనే ఉద్యోగోన్నతులు ఇచ్చేందుకు అంగీకరించారన్నారు. 117 జీవో రద్దు చేయాలని నిర్ణయించినందున కొత్త నిబంధనలు వెంటనే రూపొందించి అప్‌గ్రేడ్ చేయాల్సిన పోస్టులు గుర్తించి ఉద్యోగోన్నతులు ఇవ్వడానికి సుముఖత చూపారన్నారు. పీఎఫ్, బోధనేతర సిబ్బంది నియామకం సమస్యలపై త్వరలో నిర్ణయం తీసుకుంటారన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లతో పాటు మున్సిపల్ టీచర్లకు కూడా బదిలీల చట్టం రూపొందించి ఏప్రిల్ తరువాత బదిలీలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పూరిమెట్లలో గుప్త నిధులకు తవ్వకాలు

❖ విగ్రహాల్ని పెకిలించిన దుండగులు


విగ్రహాన్ని తొలగించి తవ్విన భారీ గుంత

ముండ్లమూరు, న్యూస్‌టుడే: గుప్త నిధుల కోసం పురాతన ఆలయంలో తవ్వకాలు జరపడం కలకలం రేపింది. ముండ్లమూరు మండలం పూరిమెట్ల గ్రామ సమీపంలో కొండ తిప్ప పైన ఉన్న వేణుగోపాల, ఆంజనేయ స్వామి ఆలయం వద్ద దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామానికి దూరంగా ఆలయం ఉండటంతో అటువైపు పెద్దగా జన సంచారం లేదు. మంగళవారం స్థానిక యువకులు అక్కడికి వెళ్లారు. విగ్రహాల్ని పెకిలించి వేసిన విషయాన్ని వారు గుర్తించారు. ఆంజనేయస్వామి విగ్రహం పక్కన పెద్ద గుంత తవ్వారు. వేణుగోపాలస్వామి ప్రతిమను బయట పడేశారు. గతంలోనూ ఇక్కడ దుండగులు పలుమార్లు తవ్వకాలు జరిపారని స్థానికులు చెబుతున్నారు.

సొత్తు దోచుకుని ఇంటికి నిప్పు !


పిచ్చిరెడ్డి కాలనీలో దగ్ధమైన ఇల్లు

పొదిలి, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ ఇల్లు అగ్నికి ఆహుతైంది. దుండగులు నగదు, బంగారు ఆభరణాలు దోచుకుని.. ఆపై నిప్పు పెట్టి ఉంటారని బాధితులు వాపోయారు. ఈ సంఘటన పొదిలి పిచ్చిరెడ్డి కాలనీలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పిచ్చిరెడ్డి కాలనీకి చెందిన బి.రమణమ్మ, కుమారుడు మధు పది రోజుల క్రితం ఉపాధి నిమిత్తం ఒంగోలు వెళ్లారు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఆమె ఇంటిలోంచి మంటలు రావడాన్ని స్థానికులు గమనించారు. వెంటనే ఇంటి తాళం పగులగొట్టి వాటిని అదుపుచేసి యజమానురాలికి సమాచారమిచ్చారు. బాధితులు వచ్చి పరిశీలించగా.. ఇంటి కిటికీ అద్దం పగులగొట్టిన ఆనవాళ్లతో పాటు రక్తపు మరకలు కన్పించాయి. ఇంట్లో ఉన్న రూ.50 వేల నగదు, ఆరు సవర్ల బంగారు ఆభరణాలు కన్పించలేదు. దుండగులు కిటికీ పగులగొట్టి లోనికి ప్రవేశించి సొత్తు దోచుకుని, ఆపై నిప్పు పెట్టారని రమణమ్మ కుమారుడు మధు అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

కంభం, న్యూస్‌టుడే : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ బుధవారం వేకువజామున పట్టుకున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని కుంట నుంచి తమిళనాడు రాష్ట్రం బంగారుపేటకు అక్రమంగా బియ్యం తరలుతోందన్న సమాచారంతో సబ్ కలెక్టర్ స్థానిక రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. వెంటనే కంభంలోని కందులాపురం కూడలికి చేరుకున్న సబ్ కలెక్టర్, అధికారులు వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ మేరకు అందులో ఉన్న సుమారు 630 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బేస్తవారపేట తహసీల్దార్ జితేంద్ర, వీఆర్వోలు పీర్సా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


లారీ వద్ద సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, తహసీల్దార్ జితేంద్ర తదితరులు

సాగర్ కాలువలో దూకుతున్నానంటూ ఫోన్ చేసి..


షేక్ రఫీ (పాతచిత్రం)

దర్శి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల నేపథ్యంలో సాగర్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంటానని భార్యకు వీడియో కాల్ చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై మురళి తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన షేక్ రఫీ (40) దర్శికి చెందిన సాదియాను పద్నాలుగేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. భార్య, పిల్లలు దర్శిలో ఉంటుండగా రఫీ బేల్దారీ మేస్త్రిగా పనులు చేసుకుంటూ వినుకొండ, దర్శిలో ఉంటున్నారు. ఆర్థిక పరిస్థితుల కారణంగా గొడవలు జరుగుతుండటంతో రఫీ వినుకొండకు వెళ్లిపోయారు. గత సోమవారం బ్యాంకు పనిపై ఆయన దర్శికి రాగా, దంపతుల మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కురిచేడు రోడ్డులో సాగర్ లాకుల వద్ద గట్టుపై నిలబడి భార్యకు వీడియో కాల్‌చేశారు. తాను కాలువలో దూకుతున్నానని చెప్పి ఫోన్ కట్ చేయగా, ఆమె ఆందోళనకు గురై వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఎస్సై మురళి సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా, కాలువ గట్టుపై రఫీ చెప్పులు, చరవాణి ఉన్నాయి. కాలువ వద్ద వెతికినా ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు భార్య సాదియా తమకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బేల్దారి దుర్మరణం

కలసపాడు, న్యూస్‌టుడే: వైఎస్సార్ జిల్లా కలసపాడు మండలపరిధిలోని గిద్దలూరు ప్రధాన రహదారిపై శింగరాయపల్లె వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బేల్దారి షేక్ మస్తాన్‌వలి (42) దుర్మరణం చెందారు. మండలపరిధిలోని కలసపాడు నుంచి తంబళ్లపల్లెకు బేల్దారి షేక్ మస్తాన్‌వలి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఓ వాహనం ఢీకొంది. ఘటనలో మస్తాన్‌వలి అక్కడికక్కడే మృతి చెందారు. మార్కాపురానికి చెందిన మస్తాన్‌వలికి ఆరేళ్ల కిందట తంబళ్లపల్లెకు చెందిన షేక్ ఖాతిజాబీతో వివాహమైంది. అప్పటి నుంచి తంబళ్లపల్లెలోనే ఉంటూ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం గుర్తింపు

చీమకుర్తి, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పి. గుడిపాడు వెళ్లే డొంక పక్కనున్న చిల్ల చెట్లలో సుమారు 45 ఏళ్ల వయస్సున్న వ్యక్తి మృతదేహాన్ని బుధవారం కొందరు వ్యక్తులు గుర్తించారు. వారు రెవెన్యూ అధికారులకు సమాచారమివ్వగా సంతనూతలపాడు మండలం పి. గుడిపాడు వీర్వో చీమకుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు వచ్చి పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. పది, పన్నెండు రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఎలాంటి ఆనవాళ్లు లభించలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు.